ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూలై 14, 2019
జాబిలమ్మ
ఇంటికి వెళ్లొద్దాం..!

అతడి ప్రేమగానం

ఒక గానంలో భగ్నహృదయం భళ్లున బద్దలవ్వాలన్నా... ఓ ఆలాపనలో పరవశం పరవళ్లు తొక్కాలన్నా గాయకునికి ఓ విలక్షణ గొంతుక కావాలి. గుండెకు గాయం చేసే అలాంటి హిందీ పాటతో సచేత్ టండన్ ఒక్కసారిగా సంచలనమయ్యాడు. మనసుకు ఓదార్పుగా సంగీతాన్ని అందించడంలోనూ మ్యూజిక్ డైరెక్టర్‌గా అతడు విజయవంతమయ్యాడు. గాన మాధుర్యం, గొప్ప స్వర సృజనలతోనే కాదు, సచేత్ తన అద్భుతమైన సాహిత్యంతోనూ కట్టిపడేస్తున్నాడు. 29 ఏళ్ల ఈ యువ సంగీత సంచలనం గురించే చర్చిస్తున్నారందరూ...!

★ లక్నో సచేత్ పుట్టి, పెరిగిన ఊరు. చదువూ, సంగీతమూ అక్కడే నేర్చుకున్నాడు.

★ సెయింట్ ఫిటిలింగ్స్ కాలేజీలో ఇంటర్ వరకూ, లక్నో విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను పూర్తి చేశాడు సచేత్. శాస్త్రీయ సంగీతాన్ని 7-15 ఏళ్ల మధ్య ఔపోసన పట్టాడు.

★ 2015లో మ్యూజిక్ ప్రొడ్యూసర్ పరంపర 'ద వాయిస్ ఆఫ్ ఇండియా' రియాల్టీ షోలో సచేత్ పాల్గొని ఫైనలిస్టుగా నిలిచాడు. దాంతో అదే ప్రోగ్రాంకి 2016లో సంగీత దర్శకుడిగా, కంపోజర్‌గా అవకాశం వచ్చింది.

★ 2016లో ఆల్ ఇండియా రేడియోలో పాటల పోటీల్లో పాల్గొన్న సచేత్‌కి జాతీయ అవార్డు వచ్చింది.

★ ఆ కార్యక్రమం ద్వారా గుర్తింపు పొంది 2017లో 'టాయిలెట్- ఏక్ ప్రేమ్ కథా' సినిమాలో 'సుభాకి ట్రెయిన్' పాటపాడేందుకు అవకాశం వచ్చింది. ఆ తర్వాత వరుసగా 'భూమీ', 'యమ్‌లా పగలా దివానా ఫిర్‌సే', 'బత్తీ గుల్ మీటర్ ఛలూ' సినిమాల్లో పాటలకు లిరిక్స్‌ని అందించి 'కబీర్ సింగ్' సినిమాలో పాట పాడాడు.

★ ప్రస్తుతం 'సాహో' చిత్రంలోని ఓ పాటకు లిరిక్స్‌ను అందించారు. 'పల్ పల్‌కి పాస్' సినిమాకి పాడతున్నాడు.

★ బాలీవుడ్‌లో మ్యూజిక్ కంపోజర్‌గా, రికార్డు ప్రొడ్యూసర్‌గా, పాట రచయితగా, సంగీత వాయిద్యకారుడిగా గుర్తింపు పొందిన వారిలో ఒకరుగా చెప్పవచ్చు.

★ ఖాళీ సమయాల్లో పాత పాట ట్యూన్స్‌ని వినడమే కాకుండా వాటిని కొత్త తరానికి అన్వయించి కొత్త తరహాలో స్వరపర్చేందుకు ఎక్కువ కృషి చేస్తుంటాడు.

★ ట్రావెలింగ్ అంటే మహా ఇష్టమట. ఖాళీ సమయాల్లో బాస్కెట్ బాల్ ఆడటం అంటే ఇష్టం. సాధ్యమైనంత సమయం కుటుంబంతో ఎక్కువ సేపు గడుపుతాడట. ఆన్‌లైన్‌లో రకరకాల ట్యూన్స్‌ని వింటూ ఎంజాయ్ చేస్తుంటాడు.

మన జూడోకా తడాఖా

పేద కుటుంబం.. వీధుల్లో కొట్లాటలు... బక్కపల్చటి దేహం.. ప్రపంచాన్ని జయించాలనే కలలు...! పదహారేళ్ల జూడోకా థాంగ్జాం తబాబి దేవి జీవితంలో, విజయాల్లో కాంట్రాస్ట్ ఎంతో..! ఇప్పటి వరకు మన దేశానికి జూడోలో ఏ విభాగంలోనూ ఒలింపిక్ మెడల్ రాలేదు.... అనే చేదు నిజాన్ని ఒక్క కిక్కుతో తబాబీ విసిరికొట్టింది. మణిపూర్‌కు చెందిన మన జూడోకా తడాఖా తెలుసుకుందాం.

★ మణిపూర్‌లోని కోక్‌చాయ్ మఖా గ్రామానికి చెందిన థోయ్‌బా సింగ్, కమలాదేవిలకు జన్మించింది తబాబి. తండ్రి రోజుకూలి పనికెళతాడు. తల్లి చేపల అమ్మకంతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. తబాబీ పతకం గెలిచే రోజున వారి ఇంటి ఆదాయం కేవలం 240 రూపాయలు..!

★ తబాబి చిన్నతనంలో ఎక్కువగా గొడవలు పడుతుండేది. ఆమెకు కోపం కూడా ఎక్కువే. ఎదురుదెబ్బలు తింటున్నా తెగువగా ఫైట్ చేయడం తన సహజ లక్షణం. తన ప్రత్యర్థి ఇంటి పక్కన అమ్మాయి. తనేమో జూడో నేర్చుకుంటోంది. బలంగా ఉంటుంది..! తనను నేలకూల్చడం తబాబీకి అయ్యే పనికాదు. అందుకే, తానూ జూడోకా కావాలనుకుంది. అయితే ఇది అబ్బాయిల ఆట అని ఆమెను తల్లిదండ్రులు అడ్డగించారు. కానీ, ఇంట్లో తెలియకుండా రహస్యంగా ప్రాక్టీస్‌కు వెళ్లేది.

★ అలా స్థానిక మయాయి లంబీ స్పోర్ట్స్ అకాడమిలో చేరింది. కూతురి పోరాట పటిమ చూసి తల్లిదండ్రులు సరేనన్నారు. నష్టం కలిగినా ఆమె కోసం ఓ రెండు చేపలు పక్కనపెట్టేది తల్లి.. తాము పస్తులున్న రోజుల్ని గుర్తుతెచ్చుకుంటూ..!

★ 2016లో సబ్ జూనియర్స్‌లో తొలి జాతీయ పతకాన్ని గెలిచాక తబాబీ కెరీర్ మారిపోయింది. 2017 కిర్గిస్తాన్‌లో నిర్వహించిన ఆసియా క్యాడెట్ జూడో చాంపియన్‌షిప్‌లో 44 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది.

★ 2018 యూత్ ఒలింపిక్ గేమ్స్‌లో వెండి పతకాన్ని సాధించింది.

★ కూతురి గెలుపుతో విందివ్వాలని తల్లి అనుకుంటే డబ్బు దొరకలేదు. అకాడమీలోని ట్రైనీలే రెండు కేజీల బియ్యం తెచ్చి సహకరించారు.

★ 2024 ప్యారిస్ ఒలింపిక్స్‌లో పతకం ఆమె లక్ష్యం.

అట్టమీది కథ 6

జాబిలమ్మ ఇంటికి వెళ్దాం..!

జపాన్ తీరంలోని తమూ మాసిఫ్ అగ్నిపర్వతం ప్రపంచంలోనే అతిపెద్ద షీల్డ్ అగ్నిపర్వతమని 2013లో శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే ప్రస్తుత అధ్యయనంలో ఇది షీల్డ్ అగ్నిపర్వతం కాదని, హవాయిలోని మౌనాలోవానే అతిపెద్ద షీల్డ్ అగ్నిపర్వతమని గుర్తించారు. మాసిఫ్ అగ్నిపర్వతం పసిఫిక్ సముద్రగర్భంలో 3,10,800 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నాలుగు కిలోమీటర్లు పొడవులో టెక్టానిక్ ప్లేట్‌ల చుట్టుముట్టి ఉండటంతో దీన్ని అతిపెద్దదిగా పేర్కొన్నారు. షీల్డ్ అగ్నిపర్వతాలు, స్ట్రాటో పర్వతాల కంటే ఎక్కువ లావాను ద్రవిస్తాయి. దీనిలో ఎక్కువ గుంటలు ఉండటంతో వాటి ద్వారా లావా ఉబికి ఉపరితలంపైకి వ్యాపించి చల్లబడటంతో పర్వతంలా ఏర్పడిందని అంచనా వేశారు. 2,000 కిలోమీటర్ల మేర సముద్రగర్భంలో ఉన్న ఈ అగ్నిపర్వతాన్ని పరిశీలించడం కష్టమవడంతో సరిగా అంచనా వేయలేకపోయారు. పసిఫిక్ మహాసముద్రంలో మౌనాకియా అతి పొడవైనదిగా, ఒజోస్ డెల్ సలాడో ఎత్తైనదిగా జాబితాలో ఉన్నాయి.



ఆపిల్ చెట్టు ... 2
ఇదీ జీవితం

సముద్రం సొంతిల్లుగా ... 5
భలే ఐడియా

లండన్ 'ఐ'తో చూడండి ... 11
యమహా నగరి

రేపటి టీచర్లు ... 14
కథ

విలువ ... 17
బాలల కథ

చంద్రుడు ... 19
సైన్స్ కథ

నెలవంక.. ఓ బాలుడు... 24
బొమ్మల కథ

మిస్టరీ అచ్చెరువు కలిగిస్తుంది.
అంతుచిక్కుంచుకోవాలనే జిజ్ఞాసకి అదే ఆధారం.

మనిషి తన గమ్యాన్ని అర్థంచేసుకోవాలంటే కచ్చితంగా ఈ విశ్వాన్ని అవగతం చేసుకోవాలి.

(చంద్రునిపై మొదటి అడుగు)
మనిషికది చిన్న అడుగే,...
కానీ, మానవాళికి అదో భారీ ముందడుగే.

-నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్

ప్రత్యేకం ... 12

రావోయి చందమామ..!

మనసులో
భయాలన్నీ మరిచిపో
మగతలో మరో లోకం తెరుచుకో
కలలతో ఉషాతీరం వెతుకుతూ
నిదరతో నిషాగానే నడిచిపో
చీటికలోన చిక్కబడ్డ కటిక చీకటి
కరిగిపోక తప్పదమ్మ ఉదయకాంతికి

జాములాతిరి జాబిలమ్మ జోల పాడనా ఇలా
జోరు గాలిలో జాజికొమ్మ జారనీయకే కల

గీతం : జాములాతిరి జాబిలమ్మ...
రచయిత : సిరివెన్నెల
చిత్రం : క్షణ క్షణం

7 జులై 2019 అట్టమీది కథ 'ఈ నగరానికి ఏమైంది..!' చాలా ఆలోచింపజేసింది. భూగర్భ జలాలు అడుగంటి దాహంతో కేకలు ఒకవైపైతే, భారీ వర్షాలతో అతలాకుతలమై ముంపునకు గురైన ప్రజల ఆర్తనాదాలు ఒకవైపు... చదివాక మనసు తల్లడిల్లింది. ఈ వ్యాసంపై చక్కని విశ్లేషణ ఇచ్చారు రచయిత. యమహా నగరి 'కుమ్మరి కళా వైభవం' ఆకట్టుకుంది. 'రామాపురం టాకీసు' కథ సంతృప్తికరంగా సాగింది. 'నవ్వుల్.. పువ్వుల్' నవ్వించాయి.

- వాడపర్తి పూజితా శ్రీబిందు, గొల్లలవలస.

స్నేహ ముఖచిత్రం పేపర్ క్వాలిటీ పెంచారు. దానివల్ల పుస్తకం చాలా ఆకర్షణీయంగా ఉంది. మన మ్యాగజైన్‌లో శీర్షికలన్నీ కథలతో సహా బాగుంటున్నాయి. అందరికీ ఉపయోగపడే వ్యాసాలు ఇస్తున్నారు. అవి ప్రజలకు, సమాజానికి ఉపయోగకరంగా ఉంటుంది.

- మర్రి సూర్యనారాయణ, విశాఖపట్నం

ప్రతి 10 మందిలో 9 మంది కాలుష్యపు గాలినే పీలుస్తున్నారని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఓ) చెబుతోంది. వాయు కాలుష్యం వల్ల కలిగే ప్రాణాంతక వ్యాధుల కారణంగా భారతదేశంలో మనిషి ఆయువు 2.6 సంవత్సరాలు తగ్గిందని 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్' (సిఎస్ఇ) 2019 నివేదికలో పేర్కొంది. గాల్లోని ధూళి కణాలు, (Particulate Matter- 2.5) ఓజోన్, గృహ వంటి మిశ్రమ వాయు కాలుష్య ప్రభావాన్ని అరికట్టేందుకు Nasofilterను ఐఐటీ ఢిల్లీ పూర్వ విద్యార్థి బృందం తయారుచేసింది. నానో ఫైబర్ టెక్నాలజీతో తయారు చేయడం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవంటున్నారు. దీని రేటు పది రూపాయలు మాత్రమే. ఆగస్టు నెల నుంచీ నాసోఫిల్టర్లు మార్కెట్‌లోకి రానున్నాయి. దీనిని ఆధారంగా చేసుకుని ఏసీ గదుల్లో, ఇంటి తలుపు, కిటికీలకు అమర్చుకునే విధంగా 'ఎయిర్ ప్యూరిఫయర్ నెట్'లను తయారు చేస్తున్నారు.



సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా : స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం : 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఆపిల్ చెట్టు

- కేఆర్టీ
98495 68901

ఇదీ జీవితం

మంగమ్మ గంపలో సైజుల వారీగా ఆపిల్స్ సర్దుకుంటోంది. వెనకనుంచీ ఆరేళ్ల బేబీ వచ్చి వీపుని వాటేసుకుంది. ముందుకి వెనక్కి ఊగుతుంటే కాయలు సర్దటం కుదరటం లేదు.

'ఆగు బేబీ.. కాయలు సర్దనీ' అంది మృదువుగా.

'ఊఁ.. ముందు నాకొక ఆపిల్ ఇవ్వు' గోముగా అడిగింది.

ఒక చిన్న ఆపిల్ తీసి ఇచ్చింది.

చెయ్యి వెనక్కి నెడుతూ..'ఉహూఁ.. నాకు పెద్ద ఆపిల్ కావాలి..' మారాం చేసింది.

'పెద్ద ఆపిల్ తినలేవు కన్నా..' నచ్చ చెబుతూ అంది.

'తింటా.. ఒకటి కాదు.. రెండు తింటా..'

'అన్నీ మనమే తింటే అమ్ముకోవటానికేం మిగుల్తాయి?'

'నాకదంతా తెలియదు. నాకు పెద్దకాయ ఇవ్వాల్సిందే' పట్టుదలగా అంది.

ఈ గొడవంతా గమనిస్తున్న నిర్మల కూతుర్ని మందలిస్తూ 'బేబీ! ఇవతలకి రా.. పెద్దమ్మని బజారుకెళ్లనీ..' అంది.

'ఇదుగో.. ఈ చిన్న ఆపిల్ తీసుకుని తిను..' అంటూ ఇందాకటి ఆపిల్ ఇస్తుంటే 'నాకేం అక్కర్లా' అంటూ బుంగమూతితో తల్లి దగ్గరకెళ్లిపోయింది, బేబీ.

'నిర్మలా! దాని కోపం తగ్గాక ఈ ఆపిల్ తినిపించవే..' అంటూ చిన్న ఆపిల్ ఇచ్చింది.

'నాకు చిన్న ఆపిల్ వద్దు, పెద్ద ఆపిల్ కావాలి..' మళ్లీ బేబి గొడవ చేసింది.

'పెద్ద ఆపిల్స్ అమ్మితేనే నాలుగు రూపాయలు మిగుల్తాయి. అన్నీ మనమే తింటే ఇక యాపారం ఏం చేస్తాం..' అంటూ గంపనెత్తి మీద పెట్టుకుని బయలుదేరింది, మరియమ్మ.

•••

ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు తారాడుతున్నాయి. మరోపక్క ఎండ తీక్షణంగా ఉంది.

మరియమ్మ ఓపిక ఉన్నంతవరకూ 'ఆపిల్ కాయలూ.. సిమ్లా ఆపిల్ కాయలూ..' అంటూ పెద్దగా కేకలు పెడుతూ వీధుల వెంట తిరిగింది.

జనాలు ఎవరి గొడవలో వాళ్లున్నారు.

ఎవరన్నా పిలుస్తారేమోనని ఆశగా అందరి మొహాలకేసి చూస్తోంది. ప్చ్ ఆమెకు నిరాశే మిగిలింది.

ఇక నడిచే ఓపికలేక వంతెన దగ్గర్లో ఉన్న చెట్టు నీడలో కూర్చుంది. అక్కడ మరికొంత మంది కూర్చుని ఉన్నారు. వాళ్లు గంపలు పెట్టుక్కూర్చున్నారు. వాటిలో మామిడిపళ్లు, జామకాయలు, ఈతపళ్లు, తాటిముంజలు ఇలా గంపకొక రకం చొప్పున ఉంచి అమ్ముతున్నారు.

చెట్టు కింద చోటు దొరకని వాళ్లు వంతెన మధ్యలో ఎండకి చెమటలు కక్కుతూ కూర్చున్నారు. మరియమ్మ వాళ్లకేసి ఆశ్చర్యంగా చూసింది. నెత్తి మాడుస్తున్న ఎండలో, కాలుతున్న నేలమీద కూర్చుని, గంపలు ముందేసుకుని ఎలా అమ్ముతున్నారో..!

'ఆపిల్ ఎలా ఇస్తున్నావమ్మా?' ఉలిక్కిపడింది మరియమ్మ. ఎవరో బట్టతలాయన ఎదురుగా ఉన్నాడు.

'పెద్దవి పాతిక రూపాయలు, చిన్నవి పది రూపాయలు బాబూ..! చాలా రుచిగా ఉంటాయి. సిమ్లా ఆపిల్సు..' చేత్తో కాయలు చూపిస్తూ అంది.

'ఇవి సిమ్లా ఆపిల్స్ కాదులే. విశాఖపట్నంవి అయి ఉంటాయి. ఈ మధ్య అక్కడ కూడా ఆపిల్ తోటలు పెంచుతున్నారట..! సరే ఇచ్చే బేరం చెప్పు..'

'వందకి అయిదిస్తాను బాబూ..! అది నేను కొన్న రేటే..'

'కాదులే ఆరు చేసి ఇవ్వు..'

'మీ దయ.. డజను ఇమ్మంటారా?' మరియమ్మ ఆశగా అడిగింది.

'అరడజను చాలు..' అంటూ తనే ఎంపిక చేసుకున్నాడు' ఒక చిన్నకాయ కొసరు ఇవ్వు' అంటూనే చిన్నకాయ తీసుకున్నాడు.

మరియమ్మ మనసు ఉసూరుమంది.

కాదంటే బేరం పోతుందేమోనని, బాధ దిగ మింగుకుంది. కాయలు సంచీలో వేసుకుని వంద కాయితం ఇచ్చాడు. అది కొద్దిగా చిరిగి ఉంది. దానికేసి తేరిపార

చూస్తు' బాబు ఇంకో నోటివ్వండి.. ఇది చిరిగింది అంది తిరిగి ఇస్తూ.

నా దగ్గర ఇంకో నోటు లేదు. అదే ఉంది. చెల్లకపోతే కాయలు తీసేసుకో..' మరియమ్మ దిగాలు పడిపోయింది.

రాకరాక వచ్చిన బోణీబేరం.. వదులుకోవాలనిపించలేదు.

'బాబూ.. ఇది చెల్లుతుందా?' అనుమానంగా అడిగింది.

'ఎందుకు చెల్లదూ? నకిలీ నోటు చెల్లదు గానీ, చిరిగిన నోటు చక్కగా చెల్లుతుంది. ఏదైనా బ్యాంకులో మార్చుకో..'

'సరే బాబూ..' అంటూ బొడ్డులోంచి గుడ్డసంచీ తీసి అందులో పెట్టుకుంది. బేరగాడు వెళ్లిపోయాడు.

మళ్లీ గొంతెత్తింది...

'సిమ్లా యాపిలు కాయలు.. రండి బాబూ రండి..'

• • •

పొద్దు వాలింది.

పిట్టలు గూటివైపు దూసుకుపోతున్నాయి.

పగలంతా ఆపిల్ పళ్ల అమ్ముకొచ్చిన మరియమ్మ ఆపసోపాలు పడుతూ ఇంటికి చేరింది. నెత్తిమీద ఆపిల్ పళ్ల గంపతో గుమ్మంలో అలసటగా కొద్దినిమిషాలు నిలబడింది. చూడటానికి ఆపిల్ చెట్టులాగానే ఉంది.

నెత్తిమీద గంపలోని ఆపిల్‌పళ్లు, చివరి పంటలా ఉన్నాయి.

'అదేంటి అక్కా! ఆపిల్ చెట్టులాగా గుమ్మంలో నిలబడిపోయావ్' నవ్వుతూ అంది నిర్మల.

'తిరిగి తిరిగి వస్తే నీరసం కమ్మేసిందే..' మెల్లగా గంప కిందపెడుతూ అంది మరియమ్మ.

'ఏమన్నా అమ్ముడు పోయాయా?' గంపలోకి చూస్తూ అడిగింది నిర్మల.

'ఏదో అమ్మాను.. బోణీ బేరమే చిరిగిన నోటిచ్చాడు. వద్దంటే ఆ బేరం.. నీకు అంటగట్టాడు.! ఇదంత తేలిగ్గా చెల్లుబాటు కాదు...'

'బ్యాంకులో మార్చుకోవచ్చుటగా?' అమాయకంగా అంది.

'సరేలే బ్యాంకులోకి మనల్నెందుకు రానిస్తారు?'

'మరెలా?!' దిగులుగా అంది.

'బ్యాంకులో కాతా ఉన్నవాళ్లని బతిమాలదాంలే.. నువ్వు నీళ్ల పోసుకురా.. వణ్ణం తిందువుగానీ..'

'వణ్ణం అంటే గుర్తొచ్చింది. మధ్యాన్నం బాగా ఆకలేసిందే. నీళ్లుతాగి కడుపు నింపుకున్నా..'

'ఒక ఆపిల్ కాయ తినొచ్చుగా..'

'అమ్ముకునే వాళ్లకి తినాలనిపించదే. అది అమ్మితే వచ్చే డబ్బులతో మళ్లీ రేపటికి ఆపిల్ కాయలు కొనొచ్చనిపిస్తుంది. ఒక పెద్దకాయ రేటుతో రెండు చిన్నకాయలు వస్తాయికదా?' అంటూ స్నానానికి సిద్ధమైంది మరియమ్మ.



• • •

'బేబీ ఇందులోంచి పెద్ద ఆపిల్ తీశావా?' లెక్క సరిచూసుకుంటూ అడిగింది మరియమ్మ.

'అవును.. తీసుకుని తినేశా..' అంది బేబీ కళ్లు చక్రాల్లా తిప్పుతూ, నిర్మలకి బాగా కోపం వచ్చింది.

అప్పడాల కర్ర తీసుకుని కొట్టడానికి సిద్ధపడింది.

మరియమ్మ అప్పడాల కర్ర లాగేసుకుంది.

'దాని తప్పేముందే.. తప్పంతా నాదే.. అడగ్గానే పెద్ద ఆపిల్ ఇచ్చి ఉంటే ఈ పని చేసేది కాదు. తింటే తిన్నావులే బేబీ' అంటూ దగ్గరకి తీసుకుని బుగ్గలమీద ముద్దుపెట్టుకుంది.

'అట్టా గారాబం చేస్తే దాని అల్లరి ఆపలేం..' అంది నిర్మల కోపంగా.

'పర్వాలేదులేవే.. పసిపిల్ల..' అంది గుండెలకి హత్తుకుంటూ.

'పెద్దమ్మా.. మనదొడ్లో ఆపిల్ చెట్టు మొలుస్తుంది' అంది బేబీ..

'ఎలా మొలుస్తుంది?!' ఆశ్చర్యంగా అడిగింది.

'నేను తిన్న ఆపిల్ కాయ గింజలు దొడ్లో పాతిపెట్టా రోజూ నీళ్లుపోస్తే, ఆపిల్ చెట్టు మొలుస్తుందిగా. అప్పుడు బోలెడన్ని ఆపిల్ కాయలు చిన్నవి, పెద్దవి.. కాస్తాయి. నువ్వు రోజూ అమ్ముకురావొచ్చు.. కదూ?'

మరియమ్మకి కళ్లవెంట నీళ్లు తిరిగాయి.

పిల్లల ఊహలు ఎంత గొప్పగా ఉంటాయి! అది జరిగే విషయం కాదని చెప్పి బేబీని బాధపెట్టడం ఇష్టంలేక 'అవునమ్మా.. అవును..!' అంటూ ఆపిల్ పళ్ల గంప తలమీద పెట్టుకుని, నడిచే ఆపిల్ చెట్టులా అమ్మకానికి సాగిపోయింది.

✦





స్త్రీలను వేధిస్తోన్న, భయపెడుతోన్న వ్యాధుల్లో రొమ్ము క్యాన్సర్ ఒకటి. కానీ, దీని గురించి అవగాహన తక్కువ. స్క్రీనింగ్ టెస్టుకు వెళ్లాలన్నా ఇబ్బందిగా భావించే వాతావరణముంది. అందుకే, ఫేజ్ దాటాక ఆస్పత్రులకు వెళ్లి రిస్క్‌లో పడుతున్నారు. నగరాల్లో చదువుకున్న కుటుంబాల్లోనే పరిస్థితి ఇలా ఉంటే... ఇక గ్రామాల్లో...! స్క్రీనింగ్ సెంటర్లు ఆస్పత్రులూ నగరాల్లో ఉండటం రోగులకు మరో పెద్ద సమస్య. వ్యాధిని ముందుగానే గుర్తిస్తే ప్రాణాల్ని నిలిపే అవకాశముంది. కానీ, ఎలా? అందుకే, మొబైల్ మామ్మోగ్రాఫ్‌తో ముందుకొచ్చిందో టీమ్. ఓ వ్యాన్‌లో స్క్రీనింగ్ యూనిట్‌ని అమర్చి ప్రతి పల్లెకు సేవల్ని చేర్చుతోంది.

భలే ఐడియా

నడిచొచ్చే మామ్మోగ్రఫీ స్క్రీనింగ్

ఇరవై ఏళ్ల వయసు అమ్మాయిల నుంచీ మరీ ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన మహిళలు వరకూ లక్షణాలను బట్టి మామ్మోగ్రఫీ ద్వారా రొమ్ము క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలి. అందుకోసం మన దేశంలో నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు. కేరళలో ఇక అటువంటి సమస్య లేకుండా పల్లెల వద్దకే కదిలొచ్చే మొబైల్ మామ్మోగ్రఫీ స్క్రీనింగ్ యూనిట్‌ని రూపొందించారు. CTFPHC విభాగంలోని కొందరు యువకులు కలిసి చర్చించుకుని ముందుకు తీసుకొచ్చిన ఈ ఐడియా మెచ్చుకోదగ్గది కదా..! నలుగురికీ ఉపయోగపడే గొప్ప ఐడియాలే కాదు, నేటి యువతరం తలచుకుంటే మొబైల్ మామ్మోగ్రఫీ వ్యాన్ డిజైనింగ్ చేయగలదని నిరూపించారు ఐఐటీ-కాన్పూర్ విద్యార్థి బృందం.

అరగంటలో...

గ్రామీణ ప్రాంతాల్లో 68 శాతం మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేయించుకోడానికి ముందుకు రావటం లేదు. వ్యాధి తీవ్రమై దాదాపు 13 శాతం మంది గ్రామీణ మహిళలు ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారని Provincial Breast Health Strategy సర్వేలు చెబుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లోని మహిళల కోసం ప్రారంభదశలోనే రొమ్ము క్యాన్సర్‌ని గుర్తించేందుకు 'డిటెక్ట్ ఎర్లీ - క్యూర్ ఫుల్లీ' అనే నినాదంతో దీనిని ప్రారంభించారు. ఒక్క ఎర్నాకుళంలోనే 300 మంది పైబడిన రోగులు మామ్మోగ్రఫీ పరీక్ష కోసం గత ఆరు నెలలుగా వేచి ఉన్నారని అక్కడ వైద్యులు చెబుతున్నారు. ఇక్కడే కాదు, దాదాపు దేశంలో కొన్ని చోట్ల జనరల్ హాస్పిటల్లో ప్రభుత్వ సదుపాయాలతో మామ్మోగ్రామ్ పరీక్ష చేయించుకోడానికి ఆరు నెలలు అంతకు మించి వేచిచూడాలి. కానీ, ఈ మొబైల్ యూనిట్ ద్వారా కేవలం 30 నిమిషాల్లో తెలుసుకోవచ్చు.



ఉచితంగానే..

గతేడాది కొచ్చిన్ రోటరీ సహకారంతో ఈ ప్రాజెక్ట్ కోసం 1.7 కోట్ల రూపాయల విలువైన మామ్మోగ్రామ్ యూనిట్‌కు నిధులు సమకూర్చారు. ఎర్నాకుళం జనరల్ హాస్పిటల్‌లో మామ్మోగ్రామ్ యూనిట్‌ని ప్రారంభించారు. 42.5 అడుగుల వ్యాన్ అధునాతన డిజిటల్ మామోగ్రఫీ స్క్రీనింగ్ సేవలను ఉచితంగా అందిస్తున్నారు. ఈ వ్యాన్‌లో ఉండే సాంకేతిక సిబ్బందిని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఐఎమ్స్) నియమించి శిక్షణనిచ్చింది. మొబైల్ మామ్మోగ్రామ్ యూనిట్‌లో వైద్యులు బెన్నీ జకారియా, మాధవ్ చంద్రన్, పి.జయశంకర్, డాక్టర్ సంజయ్ సింగ్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ జానకి పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఈ యూనిట్‌లోని మామ్మోగ్రామ్ డిజిటల్ పరికరం దేశంలో రెండవదట..! ఇందులో డ్రైవర్, సాంకేతిక సిబ్బందితోపాటు వలంటీర్లుంటారు.

ఈ మొబైల్ వ్యాన్ ముఖ్య ఉద్దేశం తెలియడం కోసం కరపత్రాల్ని ఇంటింటా పంచుతారు. క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించకపోతే కలిగే నష్టాలపై అవగాహన శిబిరాలను ఏర్పాటుచేస్తారు. ఎర్నాకుళం, ఇడుక్కి, పాలక్కాడ్ గ్రామీణ ప్రాంతాలకు పరీక్షల నిమిత్తం వెళ్తుంటారు. కేరళ ప్రభుత్వం 2030 నాటికి ఆ ప్రాంతంలోని మహిళలు క్యాన్సర్‌తో మరణించే రేటు సున్నాకి తగ్గించేందుకు ప్రయత్నం ప్రారంభించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR) నివేదిక ప్రకారం భారతదేశంలో రోజుకు 1300 మంది మహిళలు క్యాన్సర్‌తో మరణిస్తున్నారని వెల్లడించింది. 2014-2016 ఈ రేటు 9 శాతానికి పెరిగిందని చెబుతోంది. భారత్‌దేశంలో ఉండే అన్నీ గ్రామాల్లోనూ మొబైల్ మామ్మోగ్రాఫ్ యూనిట్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఓ గట్టి ప్రయత్నాన్ని చేపట్టాలి. అప్పుడే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ మరణాల్ని అరికట్టవచ్చు.

- ఐక్యత



సముద్రం సొంతిల్లుగా..!

స్ఫూర్తి

ఓ మంచి పనిని ప్రారంభించాలంటే... పెద్ద చదువులు చదువుకోనక్కరలేదు. బాధ్యతాయుతంగా ఆలోచిస్తే చాలని నిరూపించాడు కేరళ కోజికోడ్ జిల్లాలోని చోంబాలా ఓడరేవులో ఓ యువ మత్స్యకారుడు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ఏర్పడుతున్న ప్రమాదాలను ఫేస్‌బుక్‌లో చూసి ఎంతగానో బాధపడ్డాడు. అందుకోసం రాబోయే ముప్పును అరికట్టేందుకు తన వంతు ప్రయత్నాన్ని ప్రారంభించాడు కె.వి. ప్రియేష్ (30). తన ప్రయత్నంలో ఇప్పటివరకూ 13.5 టన్నుల ప్లాస్టిక్‌ను సముద్రం నుంచి బయటకు తీశాడీ పర్యావరణహితకారుడు.

ప్రియేష్ చిన్నతనం నుంచీ ఎంతో చురుకైనవాడు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు కారణంగా 10వ తరగతితోనే చదువు ఆపేయాల్సి వచ్చింది. తండ్రి అనారోగ్యం పాలవడంతో కుటుంబ పోషణ నిమిత్తం తన సొంత మావయ్యతో చేపలవేటకు సముద్రంలోకి వెళ్లడం ప్రారంభించాడు.

తాను చేస్తున్న పనిపై పట్టు రావడంతో ఒంటరిగానే వెళ్లడం ప్రారంభించాడు. సముద్రంతో అనుబంధం ఏర్పడిపోయింది ప్రియేష్‌కి. సముద్రాన్ని తన సొంత ఇల్లులా భావించేవాడు. పర్యావరణ సమస్యలను ఫేస్‌బుక్ ద్వారా చూసి ఆలోచనలో పడ్డాడు. ఇంట్లో ఎవరైనా చెత్త వేస్తే వదిలేస్తామా? శుభ్రం చేసుకోమా? అన్న ప్రశ్న తలెత్తింది. ఆనాటి నుంచి చేపలు వేటాడేందుకు సముద్రంలోకి వెళ్లిన ప్రతిసారి లోతుకు వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలనూ సేకరించి ఒడ్డుకు తీసుకొస్తుండేవాడు. ఒక్కోసారి చేపలకు బదులుగా కేవలం ప్లాస్టిక్ వ్యర్థాలను తేవడం చూసి ఊళ్లో వాళ్లంతా ఎగతాళి చేసేవారు. ఏమాత్రం వాటిని పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటూ పోయేవాడు ప్రియేష్.

ఒక్కడికి సాయంగా..

తాను చేస్తున్న ఈ పని కేవలం అక్కడితో ఆగిపోలేదు. నివాస ప్రాంతాల ప్రజలు ఎందరో వ్యర్థాలను సముద్రంలో పారేయడం గమనించాడు. ఈ విషయాన్ని పంచాయతీ దృష్టికి తీసుకెళ్లాడు. పర్యావరణ సమస్యల గురించి వివరించాడు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల మరింత ప్రమాదం ఉందని తెలిపాడు. ఆనాటి నుంచీ పంచాయతీ వార్డుల్లో ప్లాస్టిక్ వ్యతిరేక ఆపరేషన్‌ను ఏర్పాటు చేయాలనుకున్నారు. ప్రియేష్ నేతృత్వంలోని పంచాయతీ కార్మికులు, సభ్యులు, స్థానిక ఆరోగ్య ఇన్స్పెక్టర్లు, యువకులు, ఆశా కార్మికులు ఈ ఆపరేషన్ కోసం ఓ బృందంగా ఏర్పడ్డారు. ప్లాస్టిక్ వాడకం వల్ల తలెత్తుతున్న సమస్యలను ప్రియేష్ మరింత అధ్యయనం చేసి ప్రజలందరికీ తెలిపేవాడు. తాను మాట్లాడేటప్పుడు అందరూ ఎంతో శ్రద్ధగా వినడమే కాకుండా వాటిని పాటిస్తుండేవారు. ఓసారి తాను పర్యావరణ ముప్పుకు సంబంధించిన విషయాలను చెబుతుండగా... కేరళకు ఆయుర్వేద చికిత్స కోసం వచ్చి రష్యా, రొమేనియా, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియన్లు ఆ బృందంతో కలిసి వారితో పనిచేసేందుకు సిద్ధమయ్యారు.

ఫైన్ వేయాలని...

తీర ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాల కోసం స్కాట్ చేశారు. సముద్రంలో రెండు కి.మీ దూరంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో పది లోడ్ల మద్యం సీసాలను సేకరించారు. పర్యాటకులు సందర్శనకు వచ్చి వెళ్లేటప్పుడు సముద్రంలోకి ప్లాస్టిక్ బాటిళ్లను విసిరేస్తే వారికి ఫైన్ విధించాలని, అవసరమైతే వారికి శిక్ష విధించాలని ఓ నియమాన్ని తీసుకొచ్చారు. ఈ ఆపరేషన్ వల్ల పర్యావరణ సమస్యలపై వలంటీర్లుగా పనిచేయడానికి సిద్ధమైంది అక్కడ యువత. ఈ ప్రయత్నం అక్కడితో ఆగిపోదని ప్రియేష్ స్పష్టం చేశాడు. అయితే అంతకంటే ముందు తాను ఉన్నత విద్యను అభ్యసించాలనుకుంటున్నాడు. తద్వారా పర్యావరణ, సంక్షోభాల గురించి మరింత తెలుసుకోవాలనుకుంటున్నాడు.

2017లో కేరళలో (Ockhi cyclone) ఓక్పీ తుపాను సందర్భంగా సహాయక కార్యక్రమాల్లో తనవంతు కృషి చేశాడు ప్రియేష్. ప్రమాదానికి ఎదురెళ్లి ఎంతోమందిని సురక్షిత ప్రాంతానికి తరలించి మానవత్వం ఉన్న గొప్ప వ్యక్తిగా నిరూపించుకున్నాడు. గతేడాది కేరళలో సంభవించిన వరదల్లో 72 గంటల పాటు నిర్విరామంగా తనవంతు సహాయాన్ని అందజేశాడు. పర్యావరణ పరిరక్షణకై ప్రియేష్ తలపెట్టిన ఈ ప్రయత్నాన్ని మరింత విస్తృతపర్చేందుకు అడుగులు వేస్తున్నాడు. తాను చేయాల్సింది చాలానే ఉందని చెబుతున్నాడు. నిజమే..! సమాజం నిర్లక్ష్యం వహిస్తున్నప్పుడు ఇటువంటి ప్రియేష్‌ల అవసరం ఉన్నట్లే కదా మరి...!!

- వర్ధని

జాబిలమ్మ ఇంటికి వెళ్ళొద్దాం..!

అట్టమీది కథ

- సత్యాజీ
94900 99167

చందమామలో ఏముంది? అసలు చందమామ ఎలా ఉంది? అక్కడ ఏమేం ఉన్నాయి? ఈ ప్రశ్నలు మనిషిని నిరంతరం వెంటాడుతూనే ఉన్నాయి. సమాధానాలు కనుక్కొనే ప్రయత్నాలూ సాగాయి. ఈలోగా అనేక ఊహలూ, కథలూ కమ్మని వెన్నెల్లా ప్రపంచంనిండా కురిసాయి. ఆ కథల వానలో తరతరాలు తడిచాయి, మురిసాయి. మామ గుట్టును కనుక్కోవాలనే తపనను మరింత పెంచుకున్నాయి. ఆ ఊహాగాథల్లోంచి ఉత్పన్నమైన విజ్ఞానాసక్తుల అన్వేషణా పరంపర ఫలితమే చంద్రుడి మీదికి ప్రయాణం. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి దాటాక శ్రీహరికోట నుంచి మన అందరి మామ ఇంటివైపుగా రెండో 'చంద్రయానం.'

జీవితాలు ఇంత ఆదరాబాదరాగా లేనప్పటి సంగతి! నేలన నడుస్తూ .. నింగిని చూస్తూ .. ఆ రెంటి మధ్యా జనం బతుకుతున్నప్పటి విషయం. ప్రకృతిలోని ప్రతి విషయం మనిషి పట్టింపులో ఉండేది. నేలన మొలిచే మామిడిటెంకా, ఆకాశాన పొడిచే ఎర్రటి చుక్కా గమనింపులో ఉండేవి. ఆరోజు సాయంత్రపు వేళ భోజనాలు ముగిసాక... ముచ్చట్లు మువ్వలై మోగేవి. టెంకనుంచి తలెత్తుతున్న కొత్త చివురు గురించిన సంతోషం, ఆకాశంలో కొత్తగా కనిపిస్తున్న ఎర్రచుక్క విశేషం మాటల్లో దొర్లాడేవి. అలా అలా సాగి సాగి కబుర్ల నిండా ఆకాశం పరుచుకొనేది. చుక్కల్లా ఫక్కున నవ్వేది. చందమామలా దోబూచులాడేది. అనేక సందేహాలు తోకచుక్కల్లా దూసుకొచ్చేవి. చందమామ నడుస్తున్నాడా? నడిచి నడిచి ఎక్కడికి వె[illegible]? కదిలేది మేఘాలా? చందమామా? పగలంతా ఎక్కడ ఉంటాడు? మామ మధ్యలో ఉన్న మచ్చల సంగతి ఏమిటి? అక్కడ కనిపిస్తున్నది రాట్నం తిప్పుతున్న ముసలమ్మా? పారిపోతున్న కుందేలా? ప్రశ్నలు .. ప్రశ్నలు ... శరత్కాలంలో వెల్లివిరిసే చుక్కలన్ని ప్రశ్నలు. పక్కనున్న పెద్దవాళ్లు తాము విన్న ఊహించిన ఏవేవో కథలు చెబుతారు. వింటూనే .. ఊకొడుతూనే .. ఆకాశంలోకి చూస్తూనే పిల్లలు నిద్రలోకి జారుకుంటారు. కలలనిండా ఆకాశం.. ఆకాశంనిండా చందమామ... చందమామతో చెట్టాపట్టాలేసుకొని ... బోలెడు బోలెడు విహారాలూ వినోదాలూ!

చందమామ రావే జాబిల్లి రావే
బండిమీద రావే బంతిపూలు తేవే
తేరు మీద రావే తేనెపట్టు రావే
మేఘాల్లో రావే మల్లెపూలు తేవే
పరుగెత్తుకు రావే పనసపండు తేవే
అన్నిటినీ తెచ్చి మా అబ్బాయి/ అమ్మాయి కీయవే

తెలుగు లోగిళ్లలో తరతరాలుగా వినిపిస్తున్న పాట ఇది. గోరుముద్దలతో పాటు బిడ్డల హృదయంలో మధురంగా మమేకమైపోయిన భావాల మూట. మన ముత్తాత చిన్నప్పుడు వాళ్లమ్మ గోరుముద్దలు తినిపిస్తూ - చందమామను పిలిచింది. అమ్మమ్మ పసిపిల్లగా ఉన్నప్పుడు వాళ్లమ్మ పెరుగుబువ్వ తినిపిస్తూ- ఎంతో మురిపెంగా పిలిచింది. నాన్న చిన్నప్పుడు వాళ్లమ్మ కూడా పాలబువ్వ తినిపిస్తూ- బతిమాలి మరీ రమ్మంది. మన చిన్నప్పుడు అమ్మ కూడా ఇదే పాట పాడింది. తరతరాలుగా వేల ఏళ్లుగా ఎన్నిసార్లు పిలిచినా పలకలేదు చందమామ. ఎందరెందరు ఎన్ని విధాల ఆహ్వానించినా రాలేదు జాబిలమ్మ. 'రాని మామ ఇంటికి మనమే ఎందుకు వెళ్లకూడదు' అన్న ఆలోచన తలెత్తింది కూడా అప్పుడే!

ఎన్నో ఊహలూ కథలూ ...

మనిషి బాల్యంలో ఉన్నప్పుడు చందమామ ఒకలా కనిపిస్తాడు. యవ్వనంలోకి అడుగిట్టాక మరొకలా కవ్విస్తాడు. మధ్య వయసున మరొకలా .. చరమ దశలో ఇంకొకలా దర్శనమిస్తాడు. ఒకే చందమామ. ఒక్కో సందర్భంలో ఒక్కొక్క ఊహాచిత్రం.. అందుకనే మన సాహిత్యం చందమామతో చెట్టాపట్టాలేసుకొని తిరిగింది. పున్నమి, వెన్నెల, చుక్కలు, చంద్రుడు .. మన కథలను, పాటలను దేదీప్యమానం చేశాయి... చేస్తూనే ఉన్నాయి. అందనిది ఏదైనా అందంగానే ఉంటుందని సామెత. దూరపు కొండలు నునుపు అనే మాట కూడా అలాంటిదే. కనుచూపు మేరలో ఆకాశంలో అలరారుతూ కనిపించే చందమామ గురించిన మన ఊహలన్నీ అలాంటివే! చుక్కల్లో చంద్రుడు, చందమామలాంటి పిల్ల, చంద్రముఖి వంటి వాడుకలు మనకు అభిమానానికి, ఆరాధనకు పర్యాయపదాలయ్యాయి.

చందమామ గురించి బోలెడు కథలు ఉన్నాయి. తారాశశాంకం అనే పెద్ద ప్రేమకథ కూడా ఉంది. అమృతం పంచు తున్నప్పుడు రాహుకేతువులు దేవతల వరసలోకి దూరారని, ఆ సంగతిని చంద్రుడే కనిపెట్టి చెప్పాడని, విష్ణువు ఆఖరి క్షణంలో రాహుకేతువుల పీకలు తెగనరికాడని కథ ఉంది. అప్పటికే గొంతులోకి అమృతం దిగటం వల్ల రాహుకేతువులు చనిపోలేదని, తమను పట్టిచ్చాడన్న కోపంతో అప్పుడప్పుడు చంద్రుడిని మింగుతుంటారని, ఆ సమయంలోనే గ్రహణం ఏర్పడుతుందని పుక్కిట పురాణాలు ప్రచారంలో ఉన్నాయి.

అసలు సంగతి ఇదీ!

చంద్రుడి గురించి, ఆకాశం గురించి తెలుసుకోవాలన్న మనిషి తపన చాలా ప్రయత్నాలు చేసింది. అనేక అన్వేషణలూ అధ్యయనాలూ జరిపింది. తుట్టతుదకు తేలిందేమిటంటే– చంద్రుడు భూమికి ఉపగ్రహం. అంటే భూమి చుట్టూ తిరిగే ఒక గుండ్రని రాళ్లూ రప్పల దిబ్బ. మన భూమికి 3 లక్షల 84 వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. సూర్యుడి కాంతి చందమామ మీద ప్రతిఫలిస్తున్న ఫలితమే మనకు వెలుగు, వెన్నెల. ఆ కాంతి జాబిలి మీద నుంచి భూమికి చేరటానికి పట్టే వ్యవధి కేవలం 1.3 సెకన్లు! చంద్రుడి పరిమాణం భూమి పరిమాణంలో నాలుగో వంతు ఉంటుంది. మనం చంద్రుడి మీదికి వెళితే– భూమి అక్కడికి ఒక పెద్ద చందమామలా కనిపిస్తుంది. రాత్రివేళ చందమామ వెన్నెల కన్నా ఎనిమిది రెట్ల వెలుగు అక్కడ ప్రసరిస్తుంది. ఆ వెన్నెల్లో మనం చక్కా చదుకోవొచ్చు కూడా! చంద్రుడి మీద భూమిపై ఉన్నట్టు వాతావరణం లేదు. అంటే గాలి లేదు. అందువల్ల ఎండ – నీడ మధ్య తీవ్రమైన వ్యత్యాసం ఉంటుంది. తీవ్రమైన ఉష్ణోగ్రత ఉంటుంది. తీవ్రమైన చలీ ఉంటుంది. 14 రోజుల పాటు పగలు ఉంటుంది. అలాగే 14 రోజుల పాటు రాత్రి ఉంటుంది. ఇంకా చంద్రుడి మీద రాళ్లూ రప్పలూ ఉన్నాయి. నీటిజాడ గురించి పూర్తి సమాచారం లేదు. ఘనీభవించిన మంచుఫలకాలు ఉన్నాయనేది చంద్రయాన్ – 1 తరువాత నాసా ప్రకటించింది. దానిని మన ఇస్రో నిర్ధారించింది. పూర్తి సమాచారం ఇంకా రావాల్సి ఉంది.

చందమామ
గురించి

ఇన్ని విషయాలు తెలిసిన తరువాత మన పుక్కిట పురాణాల ఆయువు తీరిపోయింది. 'ఆమె ముఖం చంద్రబింబం వలె ఉన్నది' అన్న ఉపమానం అర్థరహితంగా మారింది. జ్యోతిష్కులు సూర్యచంద్రులు గ్రహాలనే ఇప్పటికీ చెబుతారు. సూర్యుడు గ్రహం కాదు, నక్షత్రం అని తెలినా; చంద్రుడు భూమికి ఉపగ్రహం మాత్రమేనని రుజువైనా – తప్పుడు కథలను ప్రచారం చేస్తూనే ఉన్నారు. విజ్ఞానాన్ని తప్పుదోవ పట్టించే ఇలాంటి మూఢత్వాన్ని వ్యతిరేకించాలి.

ఆదినుంచీ అంతరిక్షం వైపు ...

ఆకాశం గురించి, అంతరిక్ష రహస్యాల గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాస మనిషికి ఈనాటిది కాదు. విజ్ఞానశాస్త్రం ఇంతగా అభివృద్ధి చెందని కాలంలోనే– ఉన్న కొద్దిపాటి పరికరాలను వినియోగించి, తార్కిక దృక్పథాన్ని ఉపయోగించి ... ఎన్నో విభిన్న ఆలోచనలను ఆవిష్కరించారు సత్యాన్వేషకులు. సూర్యచంద్రులు గోళాకారంలో ఉన్న పెద్ద రాళ్లని, సూర్యుడి కాంతినే చంద్రుడు ప్రతిఫలిస్తున్నాడని క్రీస్తుపూర్వం 428 సంవత్సరంలోనే చాటిచెప్పాడు గ్రీకు తత్వవేత్త అనెగ్జాగోరస్. దాని ఫలితంగా అతడికి లభించిన బహుమతి కారాగార శిక్ష, దేశ బహిష్కరణ! మతం నమ్ముతున్నదానికి భిన్నంగా అతడు మాట్లాడాడన్నది అతడిపై అభియోగం. ప్రాచీన భారతీయ శాస్త్రవేత్త ఆర్యభట్ట కూడా చంద్రుడు ప్రతిఫలిస్తున్నది సూర్యకాంతేనని ప్రతిపాదించాడు. పర్షియన్ శాస్త్రవేత్త హబల్ అల్ అసీబ్ క్రీస్తుశకం 9వ శతాబ్దిలో మరికొంత నిర్దిష్ట అధ్యయనం వెల్లడించాడు. చంద్రుడి వ్యాసాన్ని, భూమి – చంద్రుడి మధ్య దూరాన్ని ఇప్పటి లెక్కలకు దగ్గరగానే గణించాడు. గెలీలియో దూరదర్శినిని రూపొందించాక– అంతరిక్ష పరిశీలన, పరిశోధన మరింత సులభతరం అయింది. భూమ్మీద నుంచి చూసి, గ్రహణ కాల వ్యవధిని, నీడలను అంచనా వేసి ... అంతరిక్ష విశేషాలను కనుగొన్నారు. ఆధునిక విజ్ఞానం, సాధన సంపత్తి అందుబాట్లోకి వచ్చాక– అంతరిక్ష అన్వేషణ మరింత వేగవంతం అయింది. సోవియట్ రష్యా అనేక ప్రయత్నాలూ ప్రయోగాలూ చేసింది. 1959లో లూనా– 2 అంతరిక్ష నౌకను పంపి, చంద్రుడి ఫొటోలను అతి దగ్గరగా తీసింది. చందమామ ఆనుపానులు మరింత ఎక్కువగా అందుబాట్లోకి వచ్చింది అప్పుడే! ఆ తరువాత పదేళ్లకు 1969 జులైలో అమెరికా మానవ సహిత అంతరిక్ష నౌకను చంద్రుడి మీదికి పంపింది. ఇప్పటివరకూ 12 మంది వ్యోమగాములు చంద్రుడి మీద అడుగు పెట్టారు. కానీ, ఇప్పటికీ చంద్రుడి గురించి తెలుసుకోవాల్సిన అనేక సంగతులు మిగిలే ఉన్నాయి. సోవియట్ యూనియన్ పతనం తరువాత రష్యా అంతరిక్ష ప్రయోగాలు తగ్గుముఖం పట్టాయి. అమెరికా అంతరిక్షంలోని ఇతరత్రా అంశాలపై దృష్టి పెట్టింది. చైనా ఈ ఏడాది ప్రారంభంలో చందమామపైకి చాంగీ – 4 అంతరిక్ష నౌకను పంపి, అక్కడి వాతావరణంలో పత్తి విత్తనాలను మొలకెత్తించే ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఆకుపచ్చని చిగురింతతో కొత్త ఆశలు మొలిపించిన ఆ పత్తిమొక్కల ఫొటోలు ఈ ఏడాది జనవరిలో మీడియాలో సందడి చేశాయి.

మన చంద్రయానాలు

చంద్రుడి సంగతులు తెలుసుకోవటానికి మన దేశం ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు చేపట్టింది. పదకొండేళ్ల క్రితం 2008 సెప్టెంబరు 22న చేపట్టిన చంద్రయాన్ –1 దీనిలో మొదటి అడుగు. చంద్రయాన్–1 చంద్రుడి చుట్టూ ఓ కక్ష్యలో తిరుగుతూ.. చంద్రుడికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, భూమికి పంపింది. చంద్రుడిపై భారత ముద్ర ఉండడం కోసం 35 కేజీల బరువున్న పరిశోధక 'మూన్ ఇంపాక్ట్ ప్రోబ్'ను (ఎంఐపీ) చంద్రుడి మీదికి జారవిడిచింది. అది చంద్రుడి ఉపరితలాన్ని ఢీ కొట్టటంతో బద్దలైపోయింది. ఆలోగానే అది సేకరించిన సమాచారం చాలా ఉందని మన శాస్త్రవేత్తలు చెప్పారు. చంద్రుడి ఉపరితలం మీద మంచురూపంలో నీరు ఉందని గుర్తించిన ఘనత చంద్రయాన్–1 దే! అయితే, ఈ నీరు మనం రోజూ హెచ్2ఓ రూపంలో కాకుండా హైడ్రాక్సిల్ అయాన్ల (ఓహెచ్) రూపంలో ఉందని ఇది గుర్తించింది. చంద్రయాన్–1 చంద్రుడి చుట్టూ దాదాపు 3 వేల సార్లు పరిభ్రమించి 70 వేల ఫొటోలను పంపింది. దీనిని రెండేళ్ల పాటు పనిచేసేలా రూపొందించారు. కానీ, పది నెలలకే సాంకేతిక సమస్యలు తలెత్తి, ఆగిపోయింది. 2009 ఆగస్టు 29న దాంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.

చంద్రయాన్ – 1 అనుభవాలను దృష్టిలో పెట్టుకొని.. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో చంద్రయాన్ – 2 ప్రాజెక్టును ఇస్రో రూపొందించింది. చంద్రయాన్–2 చంద్రుడి చుట్టూ కక్ష్యలో తిరగటంతో పాటు సున్నితంగా చంద్రుడి మీద దిగుతుంది కూడా. చంద్రయాన్–1లోని ఎంఐపీ.. విసిరేసినట్టుగా చంద్రుడిని ఢీ కొట్టి బద్దలైపోగా.. చంద్రయాన్–2లోని ల్యాండర్ మాత్రం తన రాకెట్లతో వేగాన్ని నియంత్రించుకుంటూ చాలా నిదానంగా చంద్రుడి మీద దిగుతుంది. దానిలో నుంచి రోవర్ బయటకొచ్చి చంద్రుడి మీద ఆ ప్రాంతమంతా కలియదిరుగుతుంది. ఇందులో ఎంతో సూక్ష్మంగా, అత్యంత సమర్థంగా పని చేసే ఎన్నో పరికరాలు అమర్చారు. వీటిద్వారా చంద్రుడి గురించిన ఎంతో కొత్త సమాచారం అందుకోవొచ్చని ఇస్రో భావిస్తోంది. చంద్రయాన్–1లోని మొత్తం 11

పరికరాల్లో 5 మాత్రమే మనవి. మిగతావి ఇతర దేశాలవి. చంద్రయాన్-2లోని మొత్తం 14 ఉపకరణాల్లో 13 మనవే. లేజర్ రిట్రో రిఫ్లెక్టోమీటర్ అర్రే (ఎల్ఆర్ఏ) అనే ఒక్క పరికరాన్ని మాత్రమే అమెరికా నుంచి తీసుకున్నారు. చంద్రయాన్-1 గుర్తించిన చంద్రుడి మీది నీటిజాడ తీరు తెన్నులను చంద్రయాన్-2 మరింత లోతుగా పరిశోధిస్తుంది. చంద్రుడి పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవటానికి అవసరమైన సమాచారాన్ని కూడా సేకరిస్తుంది. అక్కడి వాతావారణాన్ని, ఖనిజాలను తనకు తానే పరీక్షించి, ఫలితాలను తేల్చే యంత్రాంగం కూడా చంద్రయాన్ 2 రోవర్లో ఉంది. జులై 15వ తేదీన ప్రయాణం మొదలెట్టే ఈ నౌక సెప్టెంబరు 6వ తేదీ నాటికి చంద్రుడిని చేరొచ్చు. చంద్రయాన్ 2 భూకక్ష్యను దాటటం, చంద్ర కక్ష్యలోకి ప్రవేశించటం, చంద్రుడి చుట్టూ తిరుగుతూనే చంద్రుడి సమీపంలోకి చేరటం .. వివిధ దశలో సాగే ప్రస్థానం. చందమామ చుట్టూ తిరిగే ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడివడి.. సురక్షితంగా చంద్రుడి మీద దిగటం ఇందులో అత్యంత క్లిష్టమైన దశ. ల్యాండర్ ఉపరితలం మీదికి చేరితే- దాన్లోంచి రోవర్ బయటికి వచ్చి చంద్రుడి మీద కలయతిరుగుతూ సొంతంగా పరిశోధన మొదలు పెడుతుంది. ఆ పరిశోధనే ఈ ప్రాజెక్టు పరమ లక్ష్యం.

సమ వెన్నెల కురియాలి

మనిషి చాలా సగర్వంగా చెప్పుకోగలిగిన విజయాల్లో అంతరిక్ష యానం ఒకటి. శాటిలైట్ల ప్రయోగం ద్వారా సమాచార వ్యవస్థ అభివృద్ధి చెందటం, వివిధ రంగాల్లో ఆధునిక ప్రయోగాలు చేపట్టటం, వాతావరణం, భూభౌతిక తదితర అంశాల్లో కచ్చితమైన సమాచారాన్ని రాబట్టటం ... అంతరిక్ష విజ్ఞాన ఫలితమే! ఇన్ని విస్తారమైన విజయాలు, అద్భుతాలు సాధిస్తున్న కాలంలో కూడా మౌలికమైన అనేక వ్యత్యాసాలను, వ్యథలను పారదోలలేకపోతున్నాం. సాటి మనిషిని మనిషిగా చూడలేని వివక్ష, కులమత బేధాలూ, వాటిని మరింత పెంచి పోషించే మూఢత్వాలూ... కళ్ల ముందే స్వైరవిహారం చేస్తున్నాయి. వాస్తవానికి వీటన్నిటి విరుగుడుకు విజ్ఞానశాస్త్రం ఒక సాధనం. కానీ, ఆ సాధనాన్ని కూడా దైవదత్తంగా భావించి, అంతా దేవుడి దయ అన్నట్టుగా మన ఇస్రో శాస్త్రవేత్తలు కొందరు ప్రయోగ నమూనాలను దేవాలయాల ప్రాంగణాల్లో దయనీయంగా ప్రదర్శిస్తున్నారు. మూఢత్వం ఏదొక రూపంలో వెంటాడుతున్నప్పుడు - మన యానం విశ్వాంతరాల్లోకి ఎంత వేగంగా దూసుకుపోయినా- వివక్షలను, వ్యత్యాసాలనూ నిర్మూలించే అభివృద్ధిని సాధించలేం. సైన్సు తనకు తానే ఒక సర్వసత్తాక సాధనం. సర్వ మానవాళి సంతోషంతో చిరు దరహాసం చేసే సముజ్వల ఘట్టం కోసం అది నిరంతరంగా పనిచేయాలి. అప్పుడే విజ్ఞానానికి అర్థమూ పరమార్థమూ!

తరతరాలుగా ఎంత రమ్మన్నా రాని చందమామ ఇంటి గుట్టు మనకు ఇంకొద్ది రోజుల్లో మరింతగా తెలుస్తుంది. మానవాళికి మరొక చిన్నిల్లు చందమామ మీదనే అమర్చుకోవొచ్చు. మన తరవాతి తరాల వారు అక్కడికి తరలివెళ్లి .. 'చందమామ వచ్చేశాం.. చాలా చాలా తెచ్చేశాం' అని సంతోషంగా పాడుకోవొచ్చు. ఆ కలలన్నీ ఎప్పుడో ఒకప్పుడు కచ్చితంగా నిజమవుతాయి. ఆలోగా మన అందమైన భూమి ఆనందపడేలా అందరి మీదా సమ వెన్నెల కురిసే సంతోషాన్ని సాధించుకోవాలి! ఏక గొంతుతో ఎన్నెన్నో వెన్నెల పాటలు పాడుకోవాలి!

★

చందమామ అందిన రోజు

తరతరాలను అందంగా ఊరిస్తున్న చందమామ మనకు సరిగ్గా 50 ఏళ్ల క్రితం అందింది. దానికి ముందు అనేక ప్రయోగాలు జరిగాయి. నేల నుంచి నెలరాజును చేరటానికి సాగిన ప్రయత్నాల పరంపర ఇదీ ...

సెప్టెంబరు, 1959. అప్పటికి చంద్రుడి మీద అసలు ఏముందో, అక్కడి పరిస్థితి ఏమిటో ఎవరికీ తెలియదు. తెలుసుకొనేందుకు రష్యా తొలిగా రంగంలో దిగింది. 391 కేజీల బరువున్న శాస్త్రసాంకేతిక పరికరాలను లూనా -2 అంతరిక్ష నౌకలో ఉంచి చంద్రమండలం మీదికి పంపింది. అది సెకనుకు 11.3 కిమీల వేగంతో దూసుకుపోయి.. 36 గంటల తర్వాత చంద్రుడి మీద దిగింది. ఆ విజయం గొప్ప స్ఫూర్తి. ఆ తరువాత లూనా-3 ఉపగ్రహాన్ని ప్రయోగించి రిమోట్ కంట్రోల్ సాయంతో దానిలోని 35 ఎంఎం కెమెరాతో 29 చిత్రాలు తీశారు. చంద్రుడి అవలివైపు చూపే ఆ చిత్రాలను తొలిసారి రష్యన్ టీవీల్లో ప్రసారం చేయటం పెద్ద సందోహం. మనకు కనిపించే వైపు కంటే అవతలి వైపు చంద్రుడి మీద ఎన్నో గుర్తులు, నమూనాలకుండటం శాస్త్రవేత్తలను బాగా ఆకర్షించింది.

మరోపక్క అమెరికా 'మెర్క్యురి ప్రోగ్రాం' చేపట్టింది. అపోలో నౌకలో ఆరుసార్లు కక్ష్యలోకి మనుషులను పంపి.. సురక్షితంగా వెనక్కి తీసుకురావటం, దాని లోపల వారు చిన్నాచితకా పనులు చేయటం వంటివి సాధన చేశారు. చంద్రుడి మీద నేల ఎలా ఉంది? దాని ఉపరితలం ఎలా ఉంటుంది? అక్కడ రాకెట్ దిగితే నేల మీద నిలబడుతుందా? కూరుకుపోతుందా? మనుషులు దిగటం సాధ్యమేనా? వంటి విషయాలు తెలుసుకోవటానికి ప్రత్యేక పరిశోధన చేపట్టింది. 'రేంజర్' పేరుతో వరుసగా రాకెట్లు పంపి.. చంద్రుడి ఉపరితలం ఫొటోలు తీసింది. అలా పోగైన వందలాది నలుపు తెలుపు ఫొటోలు ఎంతో కీలకమైన సమాచారం అందించాయి. తర్వాత 'ఆర్బిటర్' చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన మ్యాప్స్ సిద్ధం చేసింది. తర్వాత 'సర్వేయర్'.. వందలాది రంగుల ఫొటోలు పంపుతూ అక్కడి నేల తీరుపై సమగ్ర సమాచారం అందించింది.

వ్యోమనౌకల ల్యాండింగ్‌కు అనువైన స్థలం ఏదో నిర్ధారించారు. అతి చల్లగా ఉండే అక్కడి వాతావరణాన్ని తట్టుకునేందుకు వీలుగా రాకెట్ నిర్మాణానికి మెరుగులు దిద్దారు. చంద్రుడి నుంచి వెనక్కి వచ్చే వ్యోమనౌక.. తిరిగి కక్ష్యలో తిరుగుతుండే రాకెట్‌తో అనుసంధానమవ్వటం (డాకింగ్) కోసం 'జెమిని' వరస రాకెట్లతో ఎన్నో రిహార్సల్స్ చేశారు. మరోవైపు 1966లో రష్యా పంపిన 'లూనా 9' సుతారంగా చంద్రుడి మెత్తటి నేల మీద దిగింది. దీంతో చంద్రుడిపై మనిషి కాలు మోపేందుకు సర్వం సిద్ధమైంది.

1968లో 'అపోలో-8'లో ముగ్గురు వ్యోమగాములను చంద్రుడి కక్ష్యలోకి పంపింది. వారు చంద్రుడికి 125 కిమీ దూరంలో కక్ష్యలో తిరుగుతూ.. 20 గంటలు గడిపారు. తమ కళ్ల ముందే ఇసుక సముద్రంలా కనబడుతున్న బూడిదరంగు చంద్రుడిని తమ కెమెరాల్లో బంధిస్తూ టీవీలకు అందించారు. కక్ష్యలో చక్కగా ఆహారం తిన్నారు. ఆరోగ్యంగా తిరిగివచ్చారు. ముఖ్యమైన ప్రస్థానం 1969 జులై 16న మొదలైంది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, మైఖేల్ కొలిన్స్, ఎడ్విన్ ఇ.ఆల్డ్రిన్ జూనియర్ అనే ముగ్గురు శాస్త్రవేత్తలు ఉన్న అపోలో-11 అంతరిక్ష నౌక ఆరోజు అంతరిక్షంలోకి దూసుకుపోయింది. జులై 21 నాటికి చంద్రుడి దరికి చేరింది. ముగ్గురిలో మైఖేల్ కొలిన్స్ కక్ష్యలో తిరుగుతుండగా నీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్ డ్రిన్ మరో చిన్న వ్యోమనౌకలో చంద్రుడి మీదికి చేరారు. ముందు ఆర్మ్‌స్ట్రాంగ్, 20 నిముషాల తర్వాత ఆల్ డ్రిన్ చందమామ మీద కాలుమోపారు. 'మనిషి వేస్తున్న ఈ చిన్న అడుగు.. మానవాళి వేస్తున్న ఓ అతి పెద్ద ముందడుగు' అని నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వ్యాఖ్యానించాడు. అక్కడ ఇద్దరూ ఫొటోలు తీసుకున్నారు. చిన్నగా గెంతారు. అమెరికా జెండా పాతారు. 'మానవాళి సుఖశాంతుల కోసం ఇక్కడికి వచ్చాం' అంటూ అధ్యక్షుడు నిక్సన్ సంతకం చేసిన ఫలకం అక్కడ ఉంచారు. 21 గంటలు గడిపిన తర్వాత తిరిగి వ్యోమనౌకలో ప్రధాన నౌకను చేరుకుని.. 195 గంటల తర్వాత భూమిని చేరుకున్నారు.

చందమామ అందిన రోజుగా జులై 21, 1969 చరిత్రలో నిలిచిపోయింది. ఈ సందర్భానికి ఇది స్వర్ణోత్సవ సంవత్సరం. ఈ సందర్భంగా నాసా ఈనెల 16 నుంచి 21 వరకూ అనేక సభలూ, సదస్సులూ నిర్వహిస్తోంది.

నమ్మారో అంతే సంగతులు...

'సోషల్' స్మార్ట్

ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా వేదికలను ఉపయోగించుకుని మానవ అక్రమ రవాణాలు రోజు రోజుకీ మరింత పెరిగిపోతున్నాయి. ట్రాఫికర్లు సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ఐడితో మరో వ్యక్తులుగా పరిచయం అవుతుంటారు. నేటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని స్నేహపూర్వకంగా మెలిగే వారిలో టేనేజర్లే అధికం. అందుకు వారిని టార్గెట్ చేస్తూ ట్రాఫికర్లు ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తుంటారు. టీనేజర్లతో ట్రాఫికర్లు చేసే సంభాషణలకు ఆకర్షితులవడం, సులువుగా వారి మాటలు నమ్మడంతో యువత ప్రమాదంలో పడుతోంది. అలా ప్రమాదంలో చిక్కుకుని తమ జీవితాన్నే పోగొట్టుకున్న కొందరి గురించి తెలుసుకుని, ఆ వాస్తవ సంఘటనల ద్వారా ప్రత్యేకంగా యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ రోజు 'సోషల్ స్మార్ట్'లో తెలుసుకుందాం.

గతేడాది చెన్నైలో పదోతరగతి చదువుతున్న అమ్మాయికి సామాజిక మాధ్యమం ధ్వారా ఓ. వ్యక్తి పరిచయమయ్యాడు. కొంత కాలంలోనే వారి పరిచయం ప్రేమకు దారి తీసింది. అలా ఒకరినొకరు ఎదరుపడకుండా సంవత్సరంపాటు ప్రేమించుకున్నారు. ఆ అమ్మాయి ఇంటికి గిఫ్టలు, వాటితోపాటు పొట్టి పొట్టి బట్టలు పంపేవాడు. ఆ బట్టల్లో తాను ఫొటో దిగి తనకోసం ఫోన్‌లో పంపాలని కోరేవాడు. ఆ అమ్మాయి కూడా అలానే పంపేది. ఇలా మూడు నెలలు గడిచాక ఓ రోజు ఇద్దరు కలుసుకోవాలని ఓ చోటకు రమన్నాడు ఆ వ్యక్తి. తాను స్నేహితురాలింటికి వెళుతున్నానని ఇంట్లో అబద్ధం చెప్పి వెళ్లి ఇప్పటివరకూ ఇంటికి చేరలేదు. తల్లిదండ్రులు పోలీసు కంప్లైంట్ ఇవ్వగా తేలిదేంటంటే.. గత మూడు నెలలుగా ఆ అమ్మాయి పంపిన ఫొటోలను పోర్న్ వెబ్‌సైట్‌ల్లో పెట్టి వ్యాపారం చేసేందుకు సిద్ధమయ్యాడు ఆ వ్యక్తి. అది తెలుసుకుని పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సైబర్ పోలీసులు విచారణ చేసి సామాజిక మాధ్యమం ద్వారా ఆ అమ్మాయిని సెక్స్ ట్రాఫిక్కింగ్‌లో అక్రమ రవాణ చేసి ఉండొచ్చని కేసు ఫైల్ చేశారు.

అబద్ధాలతో...

మార్చి, 2017 విజయవాడ సత్యనారాయణపురంలో నివాసం ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ యువకుడు కనిపించకుండా పోయాడు. తల్లిదండ్రులు తన కొడుకు స్నేహితులను, వారి బంధువులను సంప్రదించి ఊరంతా గాలించినా ఆచూకీ దొరకలేదు. ధాంతో కొడుకు పైన ఆశలు వదులుకున్నారు.



ఏప్రిల్, 2018 దినపత్రికలో వచ్చిన వార్తను చూసి తట్టుకోలేక గుండె ఆగినంత పనైంది తల్లిదండ్రులకు. తమ కొడుకు సామాజిక మాధ్యమం ద్వారా అమ్మాయిలను ట్రాప్‌చేస్తూ హ్యూమన్ ట్రాఫికింగ్ ముఠాతో కలిసి పనిచేస్తున్నాడని వార్త తెలుసుకుని. పోలీసుల ద్వారా వెంటనే కొడుకు దగ్గరకు వెళ్లిన వారికి అసలేం జరిగిందనే విషయాన్ని తెలుసుకోగా అనేకాంశాలు బయటపడ్డాయి. తాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉండగా సామాజిక మాధ్యమంలో ఓ అమ్మాయి పరిచయమైందని సంవ్సతరం పాటు వారు ఆన్‌లైన్‌లోనే మాట్లాడుకునేవారనీ అదే తను ఇష్టపడేవరకూ వెళ్లిందని తెలిపాడు. సడన్‌గా ఆ అమ్మాయిని మరో వ్యక్తికి ఇచ్చి పెళ్లిచేయబోతున్నారని మెసేజ్ చేయగా తాను తీసుకురావడానికి వెళ్లానని చెప్పుకొచ్చాడు. కానీ, అక్కడ అమ్మాయి లేదు. సామాజిక మాధ్యమంలో ఫేక్ ఐడితో అమ్మాయి పేరుతో ఓ వ్యక్తి తనతో ఇంతకాలం అబద్ధాలతో మోసం చేశాడని చెప్పాడు. ఆ యువకుడికి మాదకద్రవ్యాలను అలవాటు చేసి అమ్మాయిల వద్దకు పంపేవారనీ, వాటిని వీడియోలు తీసి చూపించి మాట వినకపోతే సామాజిక మాధ్యమంలో పోస్టు చేస్తామని బెదిరించేవాళ్లని తెలిపాడు. వారి నుంచి తప్పించుకోలేక అతడూ ఆ ముఠాతో చేతులు కలపాడు. ఇలా ఎందరో ఉన్నారట..!

గృహిణులనూ...

గతేడాది హైదరాబాద్‌లోని ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న 26 ఏళ్ల ఓ గృహిణి ఆమె చదువు, ఇతర వివరాలు

ఫేస్‌బుక్ ద్వారా తెలుసుకున్నారు. ఇంటి వద్దనే ఉంటూ వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ట్రాప్ చేశారు. రోజుకు ఐదువేల రూపాయలు సంపాదించుకోవచ్చనే మెసేజ్‌ని మెసెంజర్‌లో పెట్టారు. ఆ మెసేజ్‌కు స్పందించిన ఆ గృహిణి వారు అడిగినట్టు తన బ్యాంకు, ఇంటి అడ్రసు, ఫొటో వివరాలను మెయిల్ ద్వారా పంపించింది. నాలుగు నెలల పాటు వారు కొన్ని జాబ్ వర్క్స్‌ను ఆమెకు పంపి కంపోజ్ చేసి వాటిని మెయిల్‌కి పంపించింది. అందుకు డబ్బులు ఆ గృహిణి అకౌంట్‌లో వేసేవారు. హెడ్ ఆఫీసు బెంగుళూరులో ఉందని మూడు నెలలకోసారి ఆఫీసర్లు హైదరాబాద్ వచ్చి శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, బాగా పనిచేస్తువారిలో కొందరికి స్వయంగా చెక్కు అందజేస్తారని ట్రాఫికర్లు చెప్పారు. ఆమె ఆ విషయాన్ని నమ్మింది. శిక్షణ కోసం ఎక్కడికి రావాలో రెండు గంటల ముందు చెబుతామని చెప్పారు. అలా, వారు చెప్పిన అడ్రస్సుకు వెళ్లి ఇప్పటికీ తిరిగిరాలేదామె. కంప్లైంట్ ఇస్తే తెలిదేంటంటే ఒకరోజు హైదరాబాద్‌లో వేరు వేరు ప్రాంతాల్లో 17 మంది మహిళలు మిస్సింగ్ కేసులు నమోదు కాగా వారు అందరూ సామాజిక మాధ్యమం ద్వారా 'హోమ్ ఎట్ వర్క్' పేరుతో కిడ్నాప్‌కు గురైనట్లు సైబర్ పోలీసులు నిర్ధారించారు.



అనేక రూపాల్లో...

అక్రమ రవాణా అనేక రూపాల్లో పాల్పడుతుంటారు. అయితే సామాజిక మాధ్యమం ద్వారా వ్యక్తిగత విషయాలను తెలుసుకోవడం సులువుగా మారడంతో ఈ వేదికను అలా తెలివిగా ఉపయోగించుకుని వ్యాపారం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఏర్పడిన పరిచయాలు మూడో వ్యక్తికి తెలియకుండా టీనేజర్లు వ్యవరిస్తున్నారు. ట్రాఫికర్లు చెప్పే అబద్ధాలను నమ్మి స్వయంగా తామే లొంగిపోతున్నారు. చివరికి బాధితులను వ్యభిచారంలోకి నెట్టడం, బాధితులను బానిసత్వానికి లేదా అసంకల్పిత దాసుడిగా చేస్తున్నారు. అశ్లీల చిత్రాలను సష్టించి లైంగిక చర్యలకు పాల్పడేలా బలవంతం చేయడం. మత్తు మందు ఇచ్చి సెక్స్‌లో పాల్గొనేటప్పుడు వీడియోలను తీసి సామాజిక మాధ్యమాల్లో, పోర్న్ వెబ్‌సైటుల్లో అప్‌లోడ్ చేయడం.. వారు చెప్పినట్లుగా చేయకపోయినా, మాట వినకపోయినా తమ తల్లిదండ్రులను, పిల్లలను చంపేస్తామని బెదిరిస్తారు.

ఏ విధంగానైనా...

ఒక్కోసారి అమ్మాయిలను నమ్మించేందుకు ఒకే కుటుంబంలో ఉన్న వారిని కూడా టార్గెట్ చేస్తారు. దీన్నే సైబర్ క్రైం పోలీసులు డబుల్ ట్రాప్ అని చెబుతారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరి అమ్మాయిలనో లేక ఒక అమ్మాయి అబ్బాయిలనో వేరు వేరుగా తమ ఆధీనంలోకి తీసుకోవడం. ఇటువంటి ఘటనే ముంబైలో చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు కజిన్ (సిస్టర్స్) ఒకరు ఉద్యోగం రీత్యా మరొకరు చదువు కోసం ముంబై వెళ్లారు. అందులో ఒకరు కాలేజీ హాస్టల్‌ల్లో మరొకరు ఆఫీసు ఇచ్చిన క్వార్టర్స్‌లో ఉండేవారు. అయితే వీరిద్దరూ సెలవు రోజుల్లో కలిసి బయటకు వెళ్లడం చూసి ఓ వ్యక్తి వారిద్దరి వివరాలను, ఫేస్‌బుక్ ఐడి తెలుసుకుని సామాజిక మాధ్యమం ద్వారా వేర్వేరు వ్యక్తుల్లా పరిచయం పెంచుకున్నాడు. తక్కువ సమయంలోనే ఆ పరిచయం ప్రేమగా మారింది ఇది తెలియక. ఇద్దరితోనూ సామాజిక మాధ్యమం ద్వారా అక్కా చెల్లెలు తమ బాయ్ ఫ్రెండ్ అంటూ పరిచయం చేసుకున్నాడు. చాటింగ్, ఆన్‌లైన్ పలకరింపులతో ఆర్నెలు సాగింది. చెల్లికి కాలేజీ సెలవులు ఇవ్వడంతో, అక్క కూడా సెలవు పెట్టి ఇద్దరూ ఊరెళ్లాలనుకున్నారు. దానికి రెండురోజులు ముందు అంటే 2017 డిసెంబర్ 20న తమ ప్రియతములను ఓసారి కలుద్దాం అనుకున్నారు. కలిసేందుకు వెళ్లిన అమ్మాయిలు తిరిగి రాలేదు. కేసు నమోదు చేస్తే తెలిదేంటంటే వారు ఇద్దరూ అలా ఒకే వ్యక్తితో వేర్వేరు ఫేక్ ఐడిలతో చాట్ చేసినట్లు సైబర్ పోలీసులు తెలిపారు. కిడ్నాప్‌కు గురైనట్టు భావించి పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

టార్గెటెడ్‌గా...

ఇలా చెప్పుకుంటూ పోతే అనేక కేసులు సైబర్ పోలీసుల వద్ద నమోదైతే... కనీసం వెలుగు చూడనివి మరెన్నో...! అందుకే ముందుగా తల్లిదండ్రులు, పిల్లలూ ప్రమాదాల గురించి తెలుసుకోవాలి. టీనేజర్‌లకు స్మార్ట్ ఫోన్ అందుబాటులో ఉంచినప్పుడు జాగ్రత్తలూ తీసుకోవాలి. ట్రాఫికర్లు ఆన్‌లైన్‌లో కమ్యూనికేట్ చేయడానికి చాలా మార్గాలు ఉన్నాయి, ఇది ట్వీట్ ద్వారా, ప్రత్యక్ష సందేశం ద్వారా; గేమింగ్ చాట్ రూమ్‌లో, ఎమోషనల్, సెంటిమెంటల్ వంటి వాటిని అన్ని రకాల పద్ధతులను టార్గెట్ చేసి అమలు పరుస్తారు. ప్రాథమిక సమాచారాన్ని వారి సంభాషణల్లోనే తెలుసుకుంటారు. ఉదాహరణకు ఎక్కడ నివాసముంటారు? సామాజిక, ఆర్థిక స్థితిగతులు, బ్యాక్‌గ్రౌండ్ వంటి విషయాలను వారి మాటల్లోనే తేలికగా తెలుసుకుంటారు. నిత్యం ఒకే దృష్టితో మెలుగుతారు. చివరకు నమ్మించి వారికి అబద్ధాలను చెప్పి ఓ చోటుకి రమ్మనో లేక కాలేజీ, ట్యూషన్ నుంచి వెళ్లేటప్పుడో కిడ్నాప్ ప్లాన్ చేస్తారు.

భద్రత మీ బాధ్యతే...

మానవ అక్రమ రవాణా మూడవ అతిపెద్ద అంతర్జాతీయ నేర పరిశ్రమగా నడుస్తోంది. మీకు తెలుసా.. ఇది ప్రతి సంవత్సరం (32 బిలియన్ డాలర్లు) అంటే రూపాయిల్లో 3200 కోట్లు లాభం వస్తోంది. ఆ సంఖ్యలో, పారిశ్రామిక దేశాలలో 15.5 కోట్లు లాభం వస్తోందట..! అక్రమ రవాణా బాధితుల్లో మహిళలు, బాలికలు అధిక సంఖ్యలో ఉంటున్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా వేసింది. అందుకే అమ్మాయిలూ...! మీ వ్యక్తిగత భద్రత కోసం మీరే జాగ్రత్తలు తీసుకోపోతే ప్రమాదంలో పడతారు. ఎటువంటి వ్యక్తినైనా పూర్తిగా నమ్మినా సరే మీరు ఎప్పుడు ఎక్కడకు వెళ్తున్నారనే విషయాన్ని ఇంట్లో వారితో పంచుకోవడం మేలు. మీరెక్కడికి వెళ్లినా ఎప్పటికప్పుడు మీరున్న లోకేషన్‌ను ఇంట్లోవారితో షేర్ చేస్తూ... కమ్యూనికేట్ అవుతుండటం మంచిది. మీతో సామాజిక మాధ్యమంలో సన్నిహితంగా ఉన్న వ్యక్తి ఫేక్ ఐడితో ఉన్నారా లేదా అనేది తెలుసుకోవాలి. ఏ మాత్రం అనుమానం వచ్చినా ఫ్రెండ్ రిక్వెస్ట్ క్యాన్సిల్ చేయాలి. మీకు సామాజిక మాధ్యమంలో పరిచయమైన వ్యక్తి గురించి ఇంట్లో తల్లిదండ్రులతోనో, అన్నదమ్ములతోనో, స్నేహితులతోనో తప్పనిసరిగా పంచుకోండి. అవసరమైతే వారి ఫోన్ వివరాలు, ఇంటి అడ్రసులు తీసుకోండి అవి సరైనవో కావో నిర్ధారించుకోండి. వాటికి సంబంధించినవన్నీ ఇంట్లో ఓ డైరీలో భద్రపరుచుకోండి. ఈ విషయం పరిచయమైన వ్యక్తికి చెప్పకండి. చెప్పినవన్నీ నమ్మేముందు ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకోండి.

సైబర్‌క్రైమ్ వాచ్ సహకారంతో...

యమహా నగరీ

లండన్ 'ఐ'తో చూడండి

కళలు, విద్య, వినోదం, ఫ్యాషన్, ఆర్థిక, ఆరోగ్య, మీడియా, అన్ని రంగాల్లోనూ ముందున్న నగరాల్లో ప్రధానమైనది ఇంగ్లాండు రాజధాని లండన్. థేమ్స్ నదీ తీరంతో విస్తరించిన ఈ నగరం ఐసిసి వరల్డ్ కప్ పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది.

• లండన్ భౌగోళిక విస్తీర్ణం 3,236 చదరపు కిలోమీటర్లు. జనాభా 1,41,87,146 మంది. జనసాంద్రత ఒక చదరపు కిలోమీటరుకు 14,500 మంది. రకరకాల సంస్కృతుల ప్రజలు నివసిస్తున్నారు. జనాభాలో 37 శాతం మంది ఇతర దేశాల నుంచి వచ్చి స్థిరపడినవారే. దాదాపు 300 భాషలకుపైగా మాట్లాడతారు.

• లండన్ పార్లమెంటు భవనాన్ని 'ప్యాలెస్ ఆఫ్ వెస్ట్ మినిస్టర్', 'మదర్ ఆఫ్ పార్లమెంట్స్' అని అంటారు. ఈ కట్టడం ఆర్కిటెక్చర్ 'గోతిక్ రివైవల్ స్టైల్'లో ఉంటుంది. ఈ బిల్డింగ్ ఉత్తరాన ఉన్న క్లాక్ టవర్‌ను 'బిగ్‌బెన్' అనే పేరుతో పిలుస్తారు. ఈ ప్యాలెస్ యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది.

• జైంట్‌వీల్‌లా ఉండే అతిపెద్ద ఫెర్రీవీల్ 'లండన్ ఐ'ను థేమ్స్ నదికి దక్షిణాన నిర్మించారు. ఈ వీల్‌కు అమర్చిన క్యాప్సూల్స్ 25 మంది నడుచుకుంటూ వెళ్లేంత విశాలంగా ఉంటాయి. దీనిపై తిరుగుతూ లండన్‌ను 360 డిగ్రీల్లో వీక్షించవచ్చు.

• టవర్ ఆఫ్ లండన్‌కు దగ్గరలో థేమ్స్ నదిపై నిర్మించిన 'టవర్ బ్రిడ్జ్' నిర్మాణ నైపుణ్యం అద్భుతంగా ఉంటుంది. 65 మీటర్ల ఎత్తైన రెండు టవర్లను అనుసంధానిస్తూ 240 మీటర్ల పొడవులో నిర్మించారు. ఈ సస్పెన్షన్ బ్రిడ్జ్ గుండా పడవలు కూడా ప్రయాణించేందుకు వీలుగా 61 మీటర్ల టవర్ల మధ్యభాగం రెండుగా విడిపోయి 86 డిగ్రీలపైకి లాగబడుతుంది.

• ప్రపంచంలోనే తొలి మ్యూజియం 'బ్రిటీష్ మ్యూజియం' లండన్‌లో ఏర్పాటు చేశారు. మానవుల చరిత్ర, కళలు, సంస్కృతులను తెలిపే అనేక నమూనాలు దీనిలో ఉంటాయి. 13-19 శతాబ్దాలకు చెందిన 2,300 పెయింటింగ్‌లను ప్రదర్శనగా 'నేషనల్ గ్యాలరీ' మ్యూజియంలో ఉంచారు. ఈ బిల్డింగ్‌ను పోర్ట్‌ల్యాండ్ రాళ్లతో నిర్మించారు.

• లండన్‌లో 40 శాతం విశాలమైన భూభాగంతో నిండి ఉంటుంది. సెంట్రల్ లండన్‌లో 2,000 రకాల పూల మొక్కలు, థేమ్స్ నదిలో 120 రకాల చేపలు, 47 రకాల సీతాకోకచిలుకలు, 10,000 నక్కలు కనబడతాయి. రెండు జాతీయ ప్రకృతి రిజర్వ్‌లు, 76 స్థానిక రిజర్వ్‌లు ఉన్నాయి.

• లండన్‌లో అద్దె కాకుండా ఒక వ్యక్తి జీవించడానికి అయ్యే ఖర్చు రూ.70,000లు. జీవనప్రమాణంలో 375 నగరాల్లో లండన్ 29వ స్థానంలో ఉంది.

• లండన్‌లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ప్రపంచ నలుమూలల నుంచి ఏటా 96,000 మంది వస్తుంటారు. అయితే 20,030 గృహాలను మాత్రమే అధికారులు నిర్మిస్తున్నారు. దీంతో 65 శాతం మందికి సరైన నివాసాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.



• ప్రపంచంలోనే అతిపెద్ద గ్రంథాలయం లండన్‌లోని బ్రిటీష్ లైబ్రరీ. క్రీ.పూ 2,000 నాటి చారిత్రక పుస్తకాలతో సహ ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో 140 కోట్ల పుస్తకాలను సేకరించి దీనిలో భద్రపరిచారు.

• ప్రపంచ ప్యాలెస్‌లో ప్రసిద్ధి చెందిన బకింగ్‌హాం ప్యాలెస్ లండన్‌లోనే ఉంది. యుకె చక్రవర్తుల పరిపాలనా హెడ్‌క్వార్టర్‌గా ఈ ప్యాలెస్‌ను ఉపయోగించేవారు.

-ఉన్నత చదువులు, రీసెర్చ్‌లకు లండన్ విద్యాసంస్థలు అంతర్జాతీయంగా పేరుగాంచాయి. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు విద్యనభ్యసించేందుకు లండన్‌కు వస్తుంటారు.

• లండన్‌లో సైక్లింగ్ చేయడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతారు. సైకిల్ హైర్ స్కీంను 2010లో ప్రవేశపెట్టి ప్రజలను ప్రోత్సహపరుస్తున్నారు. ప్రత్యేకమైన దారులను కూడా ఏర్పాటు చేశారు.

• క్రికెట్‌కు నిలయమైన లండన్‌లోని లార్డ్స్ స్టేడియంలో ఐసిసి వరల్డ్ కప్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఫైనల్ మ్యాచ్‌నూ ఇక్కడే నిర్వహించనున్నారు. ఈ ప్రపంచకప్‌కు ఇంగ్లాండ్, వేల్స్ ఆతిథ్యం ఇస్తున్నాయి. ఈ స్టేడియంలో స్పోర్ట్స్ మ్యూజియం, లైబ్రరీని కూడా ఏర్పాటు చేశారు. 'ది ఓవల్' స్టేడియంలోనూ వరల్డ్‌కప్ మ్యాచ్‌లు నిర్వహించారు.

• జూరిష్ విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో వాతావరణ మార్పుల కారణంగా 2050 నాటికి లండన్‌లో బార్సిలోనాలోలాగా రిజర్వాయర్లు ఎండిపోయి తాగునీరు లేక కరువు సంభవించే పరిస్థితి ఏర్పడవచ్చని అంచనా వేస్తున్నారు.

రావోయి చందమామ..!

ప్రత్యేకం

ఊహ తెలుస్తోన్న వయసుకే మనకు పరిచయం అయ్యే మొట్టమొదటి నేస్తం చందమామ. ఆడుకోవడానికి ఆకాశం నుంచి అందుకోవచ్చునేమో..! అనుకునేటట్టుగా, అప్పటినుంచే అగుపించే ఆ అందాల అపురూపమైన బంతిని చిన్నప్పటినుంచీ చూస్తూనే ఉన్నాం. ఆ అందాల చందమామ గురించి మన తెలుగు చలనచిత్రాల్లో ఎందరో కవులు ఎన్నోరకాలుగా పాటల వెన్నెల పూయించారు. ఆ వెన్నెలలో కాసేపు విహరిద్దామా?!

"చందమామ రావే జాబిల్లి రావే
కొండెక్కి రావే గోగుపూలు తేవే
చందమామ రావే జాబిల్లి రావే" చిన్నప్పటినుంచి ప్రతివారికీ సుపరిచితమైన ఈ పాటను స్వల్పమార్పులతో జూనియర్ సముద్రాల రచించగా, రమేష్ నాయుడు సినిమా పాటగా సుమధురంగా స్వరపరిచారు.

"వెండిగిన్నెలో వేడిబువ్వ తేవే
పైడిగిన్నెలో పాలబువ్వ తేవే
అందాల బాబుకు అందించి పోవే" అంటూ అందమైన చరణాలతో సాగే ఈ పాట వింటుంటే ఇప్పటికీ మనం చిన్నతనంలోకి వెళ్ళిపోకుండా ఉండలేం. ఆ తర్వాత ఇదే పాట సిరివెన్నెల కలంతో సరికొత్త భావ సుగంధం వెదజల్లుతూ 'సిరివెన్నెల' చిత్రంలో వచ్చింది.

"చలువచందనములు పూయ చందమామ రావే
జాజిపూల తేరు మీద జాబిల్లి రావే" అంటూ మహదేవన్ సరికొత్త రాగాలతో ఆకట్టుకుంది ఈ చందమామ పాట.

తల్లిలేని వేదనతో తల్లడిల్లుతూ.. చందమామను, తల్లి కోసం అర్థించే ఓ చిన్నారి వ్యథను...
"రావే రావే చందమామ రావే
ప్రేమ తేవే అమ్మ ప్రేమ తేవే
ఒక్కసారి చిట్టిముద్దు పెట్టి పోవే" అంటూ వేటూరి వెల్లడిస్తారు 'చందమామ రావే' చిత్రంలోని పాటలో. ఎస్ జానకి ఆలపించిన ఈ గీతానికి సత్యం స్వరాలనల్లారు.

ఏ తల్లిదండ్రులకైనా తమ పిల్లలంటే ముద్దుగానే ఉంటుంది. ఆ తల్లిదండ్రుల మురిపాన్ని ముచ్చటగా చిందించారు ఆరుద్ర తన కలం ద్వారా ఇలా...
"సన్నజాజి పువ్వులు చందమామ కాంతులు చిన్నారిపాప నవ్వులు
మా ఇంటి వెలుగు మా కంటివెలుగు.. బంగారు జ్యోతుల దీవెనలు"
సుశీల, ఘంటసాలల ఈ యుగళగీతం 'అమాయకులు' చిత్రంలోని రాజేశ్వరరావు స్వరపరచిన అపురూపగీతం.



ఎంతగానో తను ప్రేమించే చెల్లిని చందమామను మించిన అందమైనదిగా వర్ణిస్తూ సాగే అనిశెట్టి గీతం అప్పట్లో అందరి గుండెలనూ పిండిన అద్భుతమైన పాట (రక్తసంబంధం చిత్రంలోనిది):
"చందురుని మించు అందమొలికించు ముద్దుపాపాయివే
నిన్ను కన్నవారింట కష్టముల నీడ కరిగిపోయేనులే"

తనపై అలక వహించిన చెలిని చందమామగా పలకరిస్తూ ఆమె కోపాన్ని పోగొట్టే ప్రయత్నం చేసే ఓ చెలికాడి మనోభావాలను సిరివెన్నెల సీతారామశాస్త్రి ఎలా చెప్పారో చూడండి. 'పెళ్ళి' చిత్రం కోసం బాలు పాడిన ఈ పాటకు సంగీతం కూర్చిన వారు కోటి:
"జాబిలమ్మ నీకు అంత కోపమా
జాజిపూల మీద జాలి చూపుమా
నీ వెండి వెన్నెల్లే ఎండల్లె మండితే
అల్లాడిపోదా రేయి ఆపుమా"

దాశరథి కలం చెలికాడినే చందమామగా చేసుకుని చిందించిన ఊహలు మధురంగా మనసుతీవెలను మీటుతాయి:
"ఇక రాలవు కన్నుల ముత్యములు
ఇక వాడవు తోటల కుసుమములు
వినువీధిని నా మది విహరించెలే..
వినువీధిని నా మది విహరించెలే..
నెలరాజే నాలో వలపులు చిలికెనులే.."

కొత్తగా పెళ్ళయిన ఓ అమ్మాయి.. తన భర్త దగ్గర లేకపోవడంతో ఆ బాధను చందమామతో అందంగా మొరపెట్టుకునే సందర్భాన్ని ఎంతో చమత్కారంగా ఓ పాటలో ఆత్రేయ చెప్పారిలా...
"చందమామా ..అందాలమామా..
నీ ఎదుట నేను
వారెదుట నీవు
మా ఎదుట ఓ మామా ఎప్పుడుంటావు"
సుశీలమ్మ గళంలో కేవి మహదేవన్ సరాగాలలో ఈ 'తేనెమనసులు'లోని పాట నిజంగానే మనల్ని తేనెలో ముంచుతూనే ఉంటుంది.

"పగలే జాబిలి ఉదయించెనేలా?" అని ప్రియుడడిగితే
"పగలే చాలును పరిహాసమేలా?" అని చెలి బదులిస్తుంది.
అప్పుడా చెలికాడంటాడు...
"తేటనీటను నీ నగవుమోము
తేలియాడెను నెలరేని వలెను" అంటూ అందంగా చెబుతాడు.
శ్రీశ్రీ చేసిన ఈ చమత్కారసాహిత్యం 'మాంగల్యబలం' చిత్రం కోసం రాయగా రాజేశ్వరరావు స్వరకల్పనలో ఘంటసాల, సుశీల ఆలపించిన సుమధురగీతం!

వలపులు నిండిన హృదయాల చేరినప్పుడు చందమామ కూడా జ వారి అంతరంగాలలో పొంగిపొరల వేరు! అవెలా ఉంటాయో పింగళి చిత్రంలో స్వీయసంగీత సారథ్యంల సుశీలతో కలిసి పాడిన ఈ పాటత
"ఎంత హాయి ఈ రేయి ఎంత
ఎంత హాయి ఈ రేయి ఎంత
చందమామ చల్లగా మత్తుమ
ఆ.. చందమామ చల్లగ పన్నీ

అప్పట్లో సమాచార వ్యవస్థ కదా! బహుశా దూరంగా ఉన్న ప్ర ద్వారానే సందేశాలు పంపుకునేవా నిజంగా అలానే అనిపిస్తూ ఉంటు
"చల్లనిరాజా ఓ చందమామా
చల్లనిరాజా ఓ చందమామా
నీ కథలన్ని తెలిసాయి ఓ చం
సదాశివబ్రహ్మం రాసిన ఈ మధుర దక్షిణామూర్తి స్వరాలల్లగా పాణిగ్రా

ప్రతి జంటకూ జీవితంలో అ అనుభూతులన్నిటినీ అందంగా అ
"హాయి హాయిగా జాబిల్లి.. తె
మందు జల్లి నవ్వసాగే ఎంద
మత్తుమందు జల్లి... నవ్వసా
స్వరసారథ్యంలో ఘంటసాల, సుశీ 'వెలుగునీడలు' చిత్రంలోనిది.

మనసారా వలచిన ప్రేయసి ప్రేమికుడు తెలిపే మధురభావనల రమేష్ నాయుడు స్వరపరచిన ఈ
"నేలమీది జాబిలీ...నింగిలోని సిరి
చేరుకోరావా నా కౌగిలీ..." రాజశ్రీ బాలు, సుశీల ఆలపించారు.
అలక తీర్చడానికి రమ్మంటూ ప్రేమికుల గళాలను చిందించిన ద మనకు "బలిపీఠం" చిత్రంలో రామ స్వరకల్పనలో ఆలపించిన ఈ పా
"చందమామ రావే.. జాబిల్లి
అమ్మాయి అలిగింది.. అలక

వలచిన చెలి తనను శాశ్వతం బాధ వర్ణనాతీతం. ఆ బాధను త చిత్రిస్తారు ఆత్రేయ...
"జాబిల్లి కోసం ఆకాశమల్లే వే
జాబిల్లి కోసం ఆకాశమల్లే వే

ం పక్కపక్కనే
త కలిస్తే
ే అనుభూతులే
'గుండమ్మకథ'
ఘంటసాల,
చెబుతారు...
మధురమీ హాయి
మధురమీ హాయి
దు చల్లగా
ీజల్లు చల్లగా"

ప్పటిలా అభివ ద్ధి చెందలేదు
ికులందరూ చందమామ
మో! ఈ పాట విన్నప్పుడు
ంది...

దమామా.. నా చందమామా..."
మైన గీతానికి సుసర్ల
హా, సుశీల, లీల ఆలపించారు.

మధురమైన తొలిరేయి నాటి
న శ్రీశ్రీ గీతం...
లిరేయి వెండి దారాలల్లి
కో...
ే ఎందుకో" పెండ్యాల
లల గానం చేసిన ఈ గీతం

తనకెంత అపురూపమో ఓ
ను తన కలంతో చిందించారు
గీతంలో ఆచార్య ఆత్రేయ...
మల్లీ నా చెలీ... నెచ్చెలీ..
మేష్ చిత్రంలోని ఈ పాటను

ఆ జాబిల్లిని పిలిచి చెప్పుకునే
శరథి కలపు పదవిన్యాసం
క ష్ణ సుశీలలు చక్రవర్తి
లో కనపడుతుంది...
రావే
తీర్చిపోవే.. అలక తీర్చిపోవే"

గా విడచి వెళ్ళిపోతే ఆ ప్రియుని
కలంతో ఇలా హద్యంగా

చాను నీ రాకకై
ాను నీ రాకకై

నిను
కానలేక
మనసూరుకోక పాడాను నేను
పాటనే
జాబిల్లి కోసం ఆకాశమల్లే వేచాను నీ రాకకై" పదాలంత అందంగానే ఈ పాటను ఇళయరాజా స్వరాలతో ఆలపించిన వారు ఎస్ పి బాలసుబ్రహ్మణ్యం... 'మంచి మనసులు' చిత్రం కోసం.

చిన్నప్పుడు తను కథలలో చదువుకున్న రాకుమారుడు తనకోసం వచ్చాడని మురిసిపోయే ఓ అమ్మాయి పరవశాన్ని మన ముందుంచారు చంద్రబోస్...

"చందమామ కథలో చదివా
రెక్కల గుర్రాలుంటాయని
నమ్మడానికి ఎంత బాగుందో..!"

'ఈ అబ్బాయి చాలా మంచోడు' చిత్రం కోసం కల్యాణి మాలిక్, సునీత ఆలపించిన ఈ పాటకు సంగీతదర్శకుడు ఎం ఎం కీరవాణి.

ప్రణయకలాపాలూ పరిహాసాలే కాదు... చందమామతో ఒకరితో ఒకరు ఫిర్యాదులు చెప్పుకున్న పాటలూ ఉన్నాయి. అలాంటి పాటల్లో అందరికీ గుర్తుండిపోయే ఈ పాటను పింగళి రాయగా రాజేశ్వరరావు స్వరకల్పనలో లీల, రాజా ఆలపించారు.

"రావోయి చందమామ మా వింత గాథ వినుమా
రావోయి చందమామ మా వింత గాథ వినుమా
సామంతము గల సతికీ ధీమంతుడ నగు పతినోయ్
సతి పతి పోరే బలమై సతమతమాయెను బ్రతుకే
ప్రతినలు పలికిన పతితో బ్రతుకగ వచ్చిన సతినోయ్
మాటలు బూటకమాయే నటనలు నేర్చెను చాలా"

ఇలా తమ కలహాన్ని, బాధను కూడా చందమామతో పంచుకునే ఈ పాట చందమామ పేరు చెప్పగానే మన మదిలో మెదిలే అందమైన పాట.

అన్ని చందమామ పాటలూ ఒక ఎత్తైతే ఆరుద్ర 'బాలభారతం' చిత్రం కోసం రాసిన ఈ పాట మరొక ఎత్తు. ప్రతిపదంలోనూ మానవుడి గొప్పదనాన్ని చాటుతూ చంద్రగోళాన్ని సైతం అతడు జయించగలడంటూ రాసిన ఈ పాట అలనాడే భవిష్యత్తును చూసి రాసిన దార్శనికతను తెలియచేస్తోంది. కాదంటారా? కావాలంటే ఈ సాహిత్యాన్ని ఒకసారి చూడండి...

"గ్రహరాశులనధిగమించి... ఘనతారల పథము నుంచి ...
గగనాంతర రోదసిలో...ఓ... గంధర్వగోళకతుల దాటి ...
చంద్రలోకమైన... దేవేంద్రలోకమైన...
చంద్రలోకమైన... దేవేంద్రలోకమైన...
బొందితో జయించి మరల భువికి తిరిగిరాగలిగే...
మానవుడే మహనీయుడు...
శక్తియుతుడు యుక్తిపరుడు... మానవుడే మాననీయుడు
మానవుడే మహనీయుడు...మానవుడే మహనీయుడు".

- రాజేష్ యాళ్ళ
9700467675

రేపటి టీచర్లు

కథ

- జగద్ధాత్రి
87122 93994

'గుడ్ మార్నింగ్ మేడమ్!'

రిజిస్టర్‌లో సంతకం చేసి తలెత్తి చూశాను. మా స్టూడెంట్. అంటే పాడేరు నుంచి వచ్చిన ట్రైబల్ స్టూడెంట్.

మా బిఎడ్ కాలేజీకి కొంత గిరిజనుల కోటా ఉంటుంది, అందులో వచ్చిన బ్యాచ్‌లో స్టూడెంట్ ఈ అబ్బాయి.

నా ఇంగ్లీష్ మెథడాలజీనే. వీరికి సరైన అవకాశాలు కల్పించి బి.ఎడ్ డిగ్రీ అందిస్తే.., ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయి. వారి గూడేలు బాగుపడతాయి. వారిని చూసి మరికొందరు చదివేందుకు ముందుకొస్తారు. ఇదొక్కటే నాతో ఎంత కష్టమనిపించినా వారి భాషను కూడా నేర్చుకునేలా చేసి వారికి దగ్గరిచేసింది. కొన్ని పోస్టులు సరైన క్యాండిడేట్లు దొరక్క మిగిలి ఉండిపోతాయి. అప్పుడు చివుక్కుమంటుంది. మిగతావాళ్ల మరికొంచెం బాధ్యత తీసుకుంటే ఈ పరిస్థితి ఉండదు. వీళ్లలో ఎక్కువమంది ఇంగ్లిష్ మెథడాలజీ తీసుకుంటారు. ఎక్కువ పోస్టులు ఉంటాయి. సింగిల్ టీచర్స్ స్కూళ్లలో ఈసారి బ్యాచ్‌లో పది మంది ఉన్నారు. అందులో ఏడుగురు ఇంగ్లిష్ తీసుకున్నారు. అయితే సోషల్, లేదా లెక్కలు మొదటి మెథడాలజీ, రెండవది ఇంగ్లిష్. తెలుగు తీసుకోవడానికి ఇష్టపడరు వీళ్ల. అలాగని ఇంగ్లిష్ వచ్చుని కాదు అస్సలు రానిది. ఇంగ్లిష్ తీసుకుంటే ఉపయోగం అని తర్వాత ఇంకా అభివృద్ధి ఉంటుందని.

'ఏమిట్రా... పొద్దున్నే' విసుగ్గా అన్నా నవ్వుతూనే. స్టాఫ్‌రూమ్ వైపు నడుస్తుంటే నాతో బాటే నడిచి వస్తున్నాడు తాను కూడా.

'ఏమిటి సంగతి వెంటబడ్డావ్?' నవ్వుతూ అడిగా.

' మరే మరండీ మేడమ్ ....'

'ఏంట్రా నసుగుడు, వెళ్ళండి అందరూ ప్రాక్టికల్స్‌కి తయారు అవ్వండి. నిన్న లెసన్స్ ఎలాట్ చేశాను కదా..! వాటికి నే చెప్పిన మోడెల్స్‌ని తయారు చేస్కోవాలి. ఎక్స్‌టర్నెల్స్ కన్నా ముందు నా దగ్గర చెప్పాలి అర్థమైందా? ఏరీ మీ మిగిలిన మీ కాబోయే టీచర్లు'

ఎప్పుడూ వాళ్ళని కాబోయే టీచర్లనే అంటాను. అలా వారి చదువు గొప్పదనం గుర్తుచేస్తుంటాను. కొండ దొరలు అని కూడా అంటూ ఉంటాను. అలా వారి పెద్ద మనసుని మెచ్చుకుంటాను. నేను అంటే మిగిలిన లెక్చరర్స్ కూడా అలాగే అనడం, చివరికి స్టూడెంట్స్ స్టాఫ్ అందరూ వాళ్ళని అలాగే పిలుస్తారు. వాళ్ళు మాత్రం ఏమీ అనుకోరు. అసలేమైనా అనుకోవాలని కూడా తెలియని పుట్ట తేనియ అంత స్వచ్ఛమైన మనసులు వాళ్లవి.

'అదే మేడమ్ మాకిచ్చిన లెసన్స్ అన్నిటికీ మోడల్స్ తయారు చేసేసాం, కానీ ...మరి ....'

'అయితే ఇంకేం తెచ్చేయండి ఈ రోజు ఓ సారి ప్రాక్టీస్ చేసేసుకుందాం. అసలే రేపు మనకి వచ్చే ఇంగ్లీష్ ఎక్స్‌టర్నెల్ చండశాసనుడు అంట' బ్యాగ్ సొరుగులో పెట్టి నా బీరువాలో బుక్స్ తీయడానికి తాళం తీస్తున్న కొండా... ఒక్కసారి ఏడుపు మొదలు పెట్టాడు. 'హే కొండా! ఎందుకలా ఏడుస్తున్నావు?' నాకు చాలా జాలి అనిపించింది.

'అది కాదు మేడమ్! లెసన్ ప్లాన్స్ అన్నీ రాసేశాం. కానీ, లెసన్ చెప్పాలంటే భయంగా ఉందమ్మా'

వాళ్ళందరూ క్లాస్ బయట నన్ను అమ్మా అంటారు. క్లాస్‌లోనే మేడమ్ అంటారు. వాళ్ళ పట్ల నేను చూపే ఆత్మీయత బహుశా నన్ను వాళ్లకి దగ్గర చేసింది. అందరు స్టూడెంట్స్‌తోనూ ఆత్మీయంగా ఉండటం నా మనస్తత్వం. భుజానికి కళ్ళు



తుడుచుకుంటూ తాను అలా చిన్న పిల్లాడిలా చెప్తుంటే నాకు చాలా బాధ అనిపించింది.

ఇది ప్రతి బ్యాచ్‌లోనూ నేను ఫేస్ చేస్తాను. వీళ్ళే కాదు, ఇంకా అసలు ఇంగ్లీష్ రాని వాళ్ళు కూడా మంచి అవకాశం వస్తుంది డీఎస్సీలో అని ఇంగ్లీష్ తీసుకుంటారు. కానీ, పాఠాలు చెప్పేదగ్గరికి వచ్చేటప్పుడు ఇలాగే డీలా పడిపోయి ఏడుస్తారు. ఒక్కొక్కసారి బాగా జ్వరం పెట్టేసుకుంటారు. ఇవన్నీ ఎక్కువ ఇంగ్లీష్ వాళ్లకే ఎదురవుతాయి. మళ్ళీ లెక్కలు కానీ, సోషల్ కానీ, సైన్స్ కానీ ఎంత బాగా చెప్తారో..! తెలుగులో కదా..! ఈ కొండా చేతి రాత చూస్తే అసలు ఏ కాన్వెంట్‌లో చదువుకున్న వాడైనా పనికి రాడు, ముత్యాలు పేర్చినట్టు ఉంటుంది.

'కొండా, నువ్వు వరాలు, లచ్చుం నాయుడు, మీరంతా మొన్న నా దగ్గర బాగానే చెప్పారు కదా నాన్నా..! అలా భయపడితే ఎలా? నేనుంటాను కదా మీ పక్కనే' అనునయంగా అన్నాను.

'మే ఐ కమ్ ఇన్ మాడమ్' గుంపుగా పదిమంది ముగ్గురు ఆడపిల్లలు, ఆరుగురు మగ పిల్లలు అందరూ నా స్టూడెంట్సే గుమ్మం దగ్గర నిలబడ్డారు.

'యెస్ కమ్ ఇన్...! ఏంటర్రా అందరూ కట్ట కట్టుకుని వచ్చారు?'

'అదే మేడమ్ మీతో మాటాడాలి అని..'

అందులో బాగా మాట్లాడేది ఎరికమ్మ. తాను సోషల్, ఇంగ్లీష్ అమ్మాయి. సోషల్ పాఠం ఆ అమ్మాయి చెప్తుంటే నిజంగా ఎంత బాగుంటుందో..! నేను నా పాఠాలు అయ్యాక సోషల్ పాఠాలు కూడా వింటుంటా. మంచి సామాజిక అవగాహన అన్వయంతో చెప్తారు పిల్లలు.

'ఏంట్రా మాటాడేది ఫైనల్ ప్రాక్టికల్స్‌లో మీ పాఠం నన్ను చెప్పమంటారా ఏంటి ?'

'అది కాదు మేడమ్ భయంగా ఉంది'

'ఓర్నీ భయమెందుకు నా దగ్గర చెప్పలేదూ, ఎలా సులువుగా చెప్పాలో మీకు నేర్పలేదూ నేను, మరి ఇప్పుడిలా భయపడితే ఎలా?'

'మీ దగ్గర చెప్పాలంటే ధైర్యంగా ఉంటుంది మేడమ్. కానీ, బయట వాళ్ల దగ్గర ....' నసిగింది దేవమ్మ. తాను లెక్కలు, ఇంగ్లీష్ స్టూడెంట్.

'భలే చెప్తున్నారు రా! మీరు.. ఎన్ని బ్యాచులు మీలాంటి వారిని పంపించాను. ఎన్ని సార్లు చెప్పాను. భయపడకూడదు అని'

'అవును మరి మీ దగ్గరైతే ధైర్యంగా చెపుతారు, మీరు ఉంటారు కనుక. మీకు ప్రతి బ్యాచ్‌కి ఈ ప్రహసనం అలవాటేగా' నవ్వుతూ అంది ఫిలాసఫీ లెక్చరర్. మమ్మల్ని అంటే బీ.ఎడ్ లెక్చరర్స్‌ని టీచర్ ఎడ్యుకేటర్స్ అంటారు.

'ఏం చేస్తాం మణీ! ఈ ఇంగ్లీష్ ఉందే ఇదొక మహమ్మారిలా భయపెడుతుంది.' నవ్వేను.

'కానీ, మీరు ఉండబట్టి ఎక్కువ మంది ఇంగ్లీష్ తీసుకుంటారు మరి. మీరు ఆ మహమ్మారికి భయపడకుండా చేస్తారుగా. అయినా మీరు ఉండగా వాళ్ళకు భయమెందుకు? ఓయ్ హలో! మీరు ముందు నా సబ్జెక్ట్



రికార్డ్ సబ్మిట్ చేయండి. లాస్ట్ డేట్ రేపే, మీకు తెలుసుగా రేపు గాని ఇవ్వక పోయారో ఎల్లుండి ఇచ్చినా చించేస్తాను.' బెదిరింపుగా అంది మణి. అనడం కాదు, ఆమె నిజంగానే చించేస్తుంది. ఆమె అంటే అందరికీ భయం కాలేజ్‌లో.

'మేము అందరం ఇచ్చేశాం మేడమ్' మమ్మల్ని ఎందుకు అంటావు అన్నట్లు ఉక్రోషంగా సమాధానం చెప్పింది సత్తమ్మ.

'ఊ సరే సరే పదండి నా క్లాస్ ఉంది' అంటూ నడిచింది మణి.

'వెళ్ళండి. మీరంతా క్లాస్‌కి కంగారు ఏమీ లేదు నేనున్నాగా చూసుకుంటా' అందరూ భయంగా నెమ్మదిగా క్లాస్‌కి వెళ్లేరు.

● ● ●

'ఏంటి మమ్మీ డల్‌గా ఉన్నావు స్ట్రెయిన్ ఎక్కువైందా కాలేజ్‌లో?' అడిగింది దివ్య.

'లేదురా, ప్రతి ఏడాది లాగానే మళ్ళీ ప్రాక్టికల్స్ రేపు. ఉదయం రోజూ కంటే చాలా ముందరే బయల్దేరాలి. ఆరుగంటల బస్సుకే వెళ్తాను.'.

కాలేజ్‌కి రోజూ నలభై కిలోమీటర్లు ప్రయాణం చెయ్యాలి రోజూ, మేముండే సిటీకి కాలేజ్ ఉండే చోటు సబర్బన్‌లో ఉంటుంది.

'ఓహో వచ్చేసిందా నీకు పరీక్ష రోజు! అబ్బా ఇప్పటికీ పదేళ్ల నుంచి చూస్తున్నాను.. వాళ్లకి పరీక్షలైతే నువ్వు కంగారు పడటం. ఆ మణి గారు, తెలుగు సార్, సోషల్ సార్, ఫిజిక్స్ ప్రసాద్ సార్ చూడు ఎంత హాయిగా ఉంటారో..! నువ్వు మాత్రం నా ఎగ్జామ్స్‌కి కూడా టెన్షన్ పడవు. కానీ, మీ కాలేజీ పిల్లల పరీక్షలంటే మాత్రం... అబ్బా లే మమ్మీ..! టీవీలో నీ ఫేవరెట్ సినిమా వస్తోంది. 'మొఘల్ ఏ ఆజమ్' చూద్దాం రా' చెయ్యి పట్టుకుని లాగింది పాప.

'ఏమి చేస్తాం రా! ప్రతి సారీ ఇదే ...,' ఏదో చెప్పబోయాను.

'మాతా.. ధరణీ.. ఇంక మేము నీ సుత్తి భరించలేం గానీ లే..! సినిమా చూద్దాం' చెయ్యిపట్టుకుని లాగి నిలబెట్టింది పాప. నేను పడుతున్న బాధ తనకేం తెలుసు చిన్న పిల్ల. మౌనంగా హాల్‌లో టీవీ దగ్గరికి కదిలాను.

● ● ●

విద్య మనిషి జీవితంలో అత్యంత ముఖ్యమైనది. విద్యా, ఆరోగ్యం ఈ రెంటినీ ప్రైవెటైజ్ చేయొద్దని మహామహులు చెప్పినా మన ప్రభుత్వాలు ఎల్పీజీ (లిబరలైజేషన్–ప్రైవేటైజేషన్–గ్లోబలైజేషన్) అంటూ చేయనే చేసింది. ఒక ఇంజినీరు మంచివాడు కాకుంటే ఒక బ్రిడ్జి కూలిపోతుందేమో..! కానీ, ఒక ఉపాధ్యాయుడు మంచివాడు కాకుంటే ఒక తరం పాడైపోతుంది. ఒక టీచర్ కనీసం 100 మందికి పాఠం చెప్తే ఆ పాఠాల్లో నాణ్యత లేకుంటే పిల్లలు

ఏమి నేర్చుకుంటారు.. ఏమి చదువుతారు? ఇన్ని బి.ఎడ్ కళాశాలలు ఉండి కొందరు మంచి ఉపాధ్యాయులనైనా తయారు చేయగలుగుతున్నామా..! అన్నది నన్నెప్పుడూ వేధించే ప్రశ్న. బి.ఎడ్‌లో చాలా చిత్రమైన విద్యార్థులు వస్తారు. కొంతమంది డిగ్రీ నుంచి వస్తే.. మరి కొంతమంది పీజీ చదివి వచ్చిన వాళు ్ళ ఉంటారు. ఇంక ఏజ్ లిమిట్ ఎక్కువ ఉంది కనుక, కొందరు ఎప్పుడో డిగ్రీలు చేసి వదిలేసినా ఇప్పుడు మళ్ళీ పిల్లలు కాస్త ఎదిగాక టీచర్లుగా ఉద్యోగాలు చేద్దామని చదవడానికి, పెళ్ళైన ఇల్లాళు ్ళ, పిల్లల తల్లులు వస్తారు. 'ఏంటి అమ్మా నీ కన్నా నీ స్టూడెంట్స్ పెద్దగా ఉన్నారు' అంటుంది పాప. ఇన్-సర్వీస్ హెచ్చార్స్ కూడా వస్తారు. అందరినీ స్టూడెంట్ టీచర్స్ అంటాం. మామూలుగా కాలేజ్ చదువు చెప్పినట్టు ఉండదు బి.ఎడ్. రకరకాల ఏజ్ గ్రూప్స్ కుటుంబ నేపథ్యాలు, ఇంకా కొందరు జీవితంలో నష్టపోయినవారు మళ్ళీ జీవితాన్ని చక్కదిద్దుకోవడానికి వస్తారు.

విడాకులు పొందిన అమ్మాయిలు, భర్తలు పోయినవారు, రకరకాల మనస్తత్వాలు. అందరినీ డీల్ చేయడం చాలా కష్టంగా ఉంటుంది. బాగా చదువుకునే మెరికల్లాంటి పిల్లలు కూడా ఉంటారు. అందరికీ డిగ్రీలోనో ఇంటర్మీడియట్‌లో చెప్పినట్టు ఒకే మూసలో చెప్పేయడం కుదరదు. కొందరు ఎంతో బాగా చదువుతారు, పాఠాలు చెప్తారు. నేను ఇంగ్లీష్ చెప్తాను, సైకాలజీ చెప్తాను. ఉపాధ్యాయులుగా వాళ్ళు పిల్లల మనస్తత్వాలను అర్థం చేస్కోవాలి. అందుకే, మనస్తత్వ శాస్త్రం. కానీ, అది నేర్పేటప్పుడు వీళ్ళ మనస్తత్వాలను అర్థం చేసుకుని నేర్పాలి. అందరి కంటే కాస్త వయసులో పెద్ద కనుక అందరినీ అర్థం చేసుకుంటాను కనుక, నన్ను మా స్టూడెంట్స్ అందరూ బాగా ఇష్టపడతారు. వాళ్ళని మంచి టీచర్లుగా తయారు చేయలేమా... అన్న ఛాలెంజ్ నాకు నేనే చేసుకున్నాను. అందుకే ఇంత ఆలోచన, శ్రమ.

ప్రతి బ్యాచ్ చివరి రోజు ఫేర్వెల్ నాడు.. ఒకటే చెప్తాను. 'డియర్ స్టూడెంట్స్ మీరందరిలోనూ మంచి టీచరు లక్షణాలు ఉన్నాయి. మీలో కొంతమంది డియస్సీ సాధించి ప్రభుత్వ టీచర్లు అవుతారు, కొందరు ప్రైవేట్ స్కూల్స్‌లో కార్పొరేట్ స్కూల్స్‌లో టీచర్స్ అవుతారు, వీళ్ళకి ఎలాగూ తప్పదు. బాగా చెప్పకపోతే తీసేస్తారు. కానీ, గవర్నమెంట్ టీచరు జాబ్ వచ్చిందా! మీరింక చదవరు.. నాకు తెలుసు, అయితే అందరికీ ఒకే మాట. మీరు గనుక టీచర్స్ అయితే దయచేసి అప్పుడప్పుడైనా సిన్సియర్‌గా పాఠాలు చెప్పండి ప్లీజ్. దేశ భవితవ్యం తరగతి గదుల్లో నిర్మింపబడుతుంది అని కొటేషన్ రాయడం కాదు, నిజంగా క్లాస్‌రూములు రాబోయే తరాలను తీర్చిదిద్దే ఆలయాలని గుర్తు పెట్టుకుని మసలుకోండి. ఇది నా సందేశం కాదు విన్నపం. ఇక్కడ మీరు ఏ పాఠాలు ఎలా చెప్పాలో నేర్చుకున్నారు. దానికి ఇంకా మీ తెలివితేటలు కృషి జోడించితే మంచి ఉపాధ్యాయులు అవుతారు. జాతి నిర్మాతలవుతారు. నేనేదో ఉద్విగ్నంగా మీకు ఇవన్నీ చెప్తున్నాను అనుకుంటున్నారు. కానీ, మీ జీవితంలో మీ టీచర్ వృత్తిలో మీరెప్పుడూ నిత్య విద్యార్థిగా ఉంటే మంచి విద్యార్థులను తయారు చేయగలుగుతారు. అమ్మ ప్రేమ, నాన్న శిక్షణ రెండు అందించే స్నేహితుడిలాంటి మంచివారు టీచర్లు. మీ అందరూ మంచి ఉపాధ్యాయులుగా దేశానికి మంచి పౌరులను అందించేవారిగా కొనసాగాలని నా ఆశ, ఆశీర్వాదం..'

నా మాటలు ఊరికేపోవు కొందరు మంచి పేరు తెచ్చుకుని వచ్చినవాళ్లున్నారు. నేను పంపిన నాలుగో బ్యాచ్ అనుకుంటా... వాసు అనే అబ్బాయికి బెస్ట్ టీచర్ అవార్డ్ వచ్చింది. ఇలా ఎక్కడెక్కడో మా స్టూడెంట్స్ గురించి ఎవరెవరి నుండో వింటుంటాం. అదే ఈ వృత్తిలో ఆనందం తృప్తీ. అయితే వాళ్ళని పరీక్షలు పాస్ చేసేటప్పుడు మాత్రం చాలా సంఘర్షణకు గురౌతాను. ప్రాక్టికల్స్, రికార్డ్స్ మార్కులు ఏడువందల మార్కులు మా చేతిలో ఉంటాయి. అందుకే బి.ఎడ్ లెక్చరర్లు అంటే స్టూడెంట్స్ చాలా విలువ ఇస్తూ భయంగా మసలుతారు.

స్టూడెంట్స్‌కి అందరికీ మళ్ళీ పర్సంటేజ్ బాగుండాలి. రాత పరీక్షలలో తగ్గినా ప్రాక్టికల్స్‌లో అందరికీ ఫస్ట్ క్లాస్ మార్కులు వేయాలి. పరీక్షల పేపర్లు కరెక్ట్ చేసేటపుడు కూడా ఇదే బాధ నాకు. ఎప్పుడూ ఒకటే ఆలోచన నన్ను వేధిస్తుంది. 'నాణ్యత లేని ఉపాధ్యాయులను తయారు చేసి దేశం మీదకి వదిలి ద్రోహం చేస్తున్నామా మేము.

(ఉపాధ్యాయులకే ఉపాధ్యాయులం కదా) లేక కేవలం ఈ డిగ్రీ ఉంటే జీవనోపాధి కల్పించుకుని బతకాలనుకునే వారికి సహాయం చేస్తున్నామా? ఇదే ఎప్పుడు నా మదిని వేధించే ట్రిల్లియన్ డాలర్ ప్రశ్న! విద్యా నాణ్యతా ప్రమాణాలు గురించి పట్టించుకోని ప్రభుత్వాలు, అందుకే కార్పొరేట్ స్కూల్స్‌లో తమ పిల్లలను కడుపుకట్టుకుని చదివిస్తోన్న తల్లితండ్రులు. అలాగని పోనీ, కార్పొరేట్ స్కూల్స్‌లో విద్యా ప్రమాణాలు బాగున్నాయా అంటే... 'అదొక నరకకూపం పిల్లలకి. నూరి రుబ్బి పిల్లల్ని బండ మెషీనుల్లాగా తయారు చేస్తున్న మన విద్యా సంస్థలు. ఏ దేశం, ఏ వ్యవస్థ బాగుపడాలన్నా అది విద్య మీద కదా ఆధారం. అలాంటి విద్యని నాణ్యంగా ఎందుకు అందించలేకపోతున్నాం అన్నదే నా వ్యధ!!!

• • •

ప్రాక్టికల్స్ రోజు వచ్చిన ఎక్స్‌టర్నెల్‌తో మాట్లాడుతూ పిల్లలతో పాఠాలు చెప్పించేస్తాను నేను. ముందు బాగా చెప్పే వాళ్ళని ముందు పెట్టి, తర్వాత కాస్త వీక్‌గా ఉన్న వాళ్ళు చెప్పేటప్పుడు అవతలి వాళ్ళని మాటల్లో పెట్టి సర్దేస్తుంటాను.

మేము ఎలా చెపితే అలా మార్కులు వేసేస్తారు.. సహజంగా వచ్చినవాళ్ళు. ఎందుకంటే, వాళ్ళ కాలేజీలకి మేము వెళ్ళినా అంతేగా మరి. ఇలా మా పాస్ పర్సెంటేజ్ మాత్రమే మాకు కావాలి అంతే..! మా కాలేజీలు నడవాలిగా మరి.

ఈ బ్యాచ్‌లో నాకు యాభై మంది స్టూడెంట్స్. నిజానికి నేను గమనించాను వాళ్ళలో చాలా ప్రజ్ఞ, తపన ఉంటాయి కానీ, భయపడతారు. ఆ భయాన్ని పోగొట్టేమా వాళ్ళంత గొప్ప వాళ్ళు ఉండరు. వాళ్ళలో చదువు పట్ల గౌరవం, ఈ చదువు తాము చదివేసుకుని తమ పిల్లలను తీర్చిదిద్దుకోవాలనే తపన మాత్రం అందరిలోనూ ఉంటుంది. ఇక్కడ పాఠాలు చెప్పలేకపోయినవాళ్ళు ఎందరో తర్వాత మంచి టీచర్లుగా ముఖ్యంగా ఇంగ్లీష్ టీచర్లుగా పేరు తెచ్చుకున్నారు.

'వావ్ ! ఏమి చెప్పిందండీ ఈ అమ్మాయి, నీ పేరేంటమ్మా?' వచ్చిన ఎక్స్‌టర్నెల్ పెద్దవారు.. సత్తెమ్మ చెప్పిన టాగోర్ పద్యం ఎనిమిదో తరగతి పాఠం 'డే బై డే ఐ ఫ్లోట్ మై పేపర్ బోట్స్' విని చాలా సంతోష పడిపోయారు. 'ఇలా రామ్మా అవునూ! సియులి ఫ్లవర్స్ అంటే పారిజాతాలు అని ఎలా తెలుసుకున్నావు?' వెంకట్రావు మాస్టారు చాలా సీనియర్ ఇంగ్లీష్ మాస్టారు ఆనాటి విలువలు ప్రమాణాలు పాటించేవారు. ఆయన అలా మురిసిపోతూ అడుగుతుంటే నాకు మనసు నిండిపోయింది. 'మా మేడమ్ చెప్పేరు సార్' సిగ్గుపడుతూ చెప్పింది సత్తెమ్మ. 'సొ నైస్ ఆఫ్ యూ ధరణి గారూ ఇలా మీలా సిన్సియర్‌గా పాఠాలు చెప్పే వాళ్ళు ఇంకా ఎక్కడో అక్కడ ఉండబట్టే మన ఉపాధ్యాయ విద్యార్థులు నాణ్యంగా తయారువుతున్నారు. అందరూ మీలాగా సిన్సియర్‌గా చెప్తే మనం మంచి ఉపాధ్యాయులను అందించగలుగుతాం. 'ఐ కంగ్రాట్యులేట్ యూ' మనస్ఫూర్తిగా అన్నారు మాస్టారు. మా వెంకట్రావు మాస్టారు నుంచి అభినందన అంటే అవార్డ్‌గా భావిస్తాం మా టీచర్ ఎడ్యుకేటర్స్ అందరం. ఆ అమ్మాయి చెప్పిన పాఠం బట్టీ నన్ను అంచనా వేసి మెచ్చుకున్న మాస్టారిని చూస్తే నాకు ఆనందంతో మనసు నిండిపోయింది. మిగిలిన వారి పాఠాలను ఎలాగో గబ గబ చెప్పించేశాను అనుకోండి. మా సత్తెమ్మ లాంటి వారి పాఠాలు విన్న మాస్టారు రిలాక్స్ అవుతుంటే కాస్త చెప్పలేని వాళ్ళు మా కొండ, ఇంకా మరి కొందరిచేత గబుక్కున పూర్తి చేసేసి హమ్మయ్య ఈ బ్యాచ్ దాటేసినట్టే అని ఊపిరి పీల్చుకున్నాను. నాకు వీళ్ల మీద నమ్మకం ఎక్కువ.. భవిష్యత్తులో మంచి టీచర్లు అవుతారని. ఒక్క అవకాశం ఇచ్చాం అంతే..! నా దేశాన్ని, భావితరాలను దిద్ది తీర్చే మంచి ఉపాధ్యాయులు, వారిని వారు దిద్దుకుని మంచి సంకల్పంతో.. వెనక్కి జారపడ్డాను కుర్చీలో.

బాలల కథ



విలువ

దేవరపాలెం గ్రామంలో ధర్మయ్య అనే మధ్యతరగతి రైతు ఉండేవాడు. ఆయన అందరికీ నోట్లో నాలుకలా ఉంటూ వారి మంచిచెడ్డలలో పాలుపంచుకుంటూ ఉండేవాడు. గ్రామంలో ఎవరికీ ఎలాంటి సమస్య వచ్చినా తాను దగ్గరుండి పరిష్కరించేవాడు. ప్రభుత్వపరంగా రావాల్సిన రాయితీలను తానే దగ్గరుండి అందరికీ సమంగా అందేలా కృషి చేసేవాడు. పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుగా ఆయన్నే ఎన్నుకొనేవారు. అందరూ ఆయనను గొప్పగా, గౌరవంగా చూసుకునేవారు. గ్రామనాయకుడుగా ఆయనకు ఎదురులేదు. ఆయన దారిన వెళుతుంటే అరుగుల మీద కూర్చున్న వారంతా మర్యాదపూర్వకంగా లేచి ఆయనకు నమస్కరించేవారు. ఆయన కూడా వారిపట్ల ఎంతో మర్యాదగా ప్రవర్తించేవాడు. వృద్ధులను, మహిళలను గౌరవించేవాడు.

అదే గ్రామంలో కనకయ్య మోతుబరి రైతు ఉండేవాడు. సిరి సంపదల్లో ఆ గ్రామంలో అతనికి మించినవారేలేరు. ఆ ఊరిలో బాగా ఉన్నవాడినని కాసింత గర్వం ఉన్నా ధర్మయ్యతో అనుకూలంగా ఉంటూ, ఆయన మాటలను గౌరవిస్తూ, ఆయనను అనుసరించి ఆయన సలహా మేరకు నడుచుకునేవాడు. కనకయ్య ఎలాంటి వాడైనా ధర్మయ్యతో పాటు ఉంటాడు కాబట్టి అందరూ ఆయన్నూ గౌరవంగా చూసేవారు. ఎదురైతే మర్యాదపూర్వకంగా వందనం చేసేవారు. ధర్మయ్యలాగా తనను గ్రామంలోని వారంతా బాగా అభిమానిస్తున్నారని ఆనందపడేవాడు కనకయ్య. దాంతో తాను కూడా ఆ గ్రామంలో గొప్పవాడేనని కాసింత గర్వం కూడా చోటుచేసుకుంది. ధర్మయ్యకు సమానంగా తనకు తానూ గొప్పదనం ఆపాదించుకొనే స్థాయికి ఎదిగాడు కనకయ్య.

ఇలా ఉండగా పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. అందరూ ఎప్పటిలాగా ధర్మయ్యనే ఉండమని కోరారు. కానీ, తాను ధర్మయ్యకే మాత్రం తక్కువ కాదని ఈసారి తాను సర్పంచ్‌గా ఉంటానని ముందుకొచ్చాడు కనకయ్య. గ్రామస్తులు చెప్పినా వినకుండా పోటీలో నిలిచాడు కనకయ్య. ధరావత్తు కూడా రాకుండా ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయాడు. ఆ తర్వాత గ్రామంలో అతనికి ఎవరూ చేతులెత్తి నమస్కరించలేదు కదా..! కనీసం పలకరించడం కూడా మానేశారు.

దానిని తప్పుపట్టిన కనకయ్య ఒకరిద్దరిని నిలేసి, తనకు అంతకు ముందులా ఎందుకు గౌరవం ఇవ్వడం లేదు అని అడిగాడు.

దానికివారు 'అయ్యా అప్పుడు కూడా ప్రత్యేకంగా నిన్ను ఎవరూ గుర్తించలేదు. గౌరవం ఇవ్వలేదు. ధర్మయ్యగారి వెనకాల ఉన్నారు కాబట్టి ఆయనతోపాటు నిన్నూ గౌరవించారు. ఇప్పుడు ఆయన్ను వదిలేసి దూరంగా ఉన్న నీకు మర్యాదలు ఎలా వస్తాయి. ఆయన ఒకటైె నీవు సున్నా. ఒకటికి పక్కనుంటేనే సున్నాకు విలువ' అని చెప్పారు.

మారు మాట్లాడకుండా తలవంచుకుని ముందుకు సాగిపోయాడు కనకయ్య.

- కైపు ఆదిశేషారెడ్డి
99857 14281



చంద్రుడు

భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) గగనంలో మరో ఘనత సాధించేందుకు సిద్ధమవుతోంది. అనేక ప్రతిష్టాత్మక ప్రయోగాలతో దేశ ఖ్యాతిని ఆకాశమంత ఎత్తుకు చేర్చిన షార్.. మంగళ్‌యాన్, చంద్రయాన్-1 వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను సైతం విజయంతం చేసిన ఆత్మవిశ్వాసంతో.. చంద్రయాన్-2 ప్రయోగానికి సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతూ.. ఇప్పటికే నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్ రెండో ప్రయోగవేదికకు జీఎస్ఎల్‌వీ మార్క్-3 రాకెట్‌ను తరలించారు. జీఎస్ఎల్‌వీ మార్క్-3 రాకెట్ ద్వారా చంద్రయాన్ -2ను ప్రయోగించనున్నారు. వారం రోజుల పాటు వివిధ పరీక్షలు నిర్వహించనున్న ఇస్రో శాస్త్రవేత్తలు... ఈ నెల 15వ తేదీన తెల్లవారుజామున 2.51 గంటలకు చంద్రయాన్-2ను నింగిలోకి పంపనున్నారు.... పేపర్ వార్తలు, అసెంబ్లీలో చదువుతుంది ప్రజ్ఞ. మరికొన్ని వార్తలు చదవటంతో పూర్తయింది అసెంబ్లీ.

సార్ క్లాసులోకి వచ్చి అటెండెన్స్ వేయటం పూర్తి కాగానే, 'పిల్లలూ...! ఈరోజు అసెంబ్లీలో చదివిన విషయాల గురించిన మీకేమైనా సందేహాలున్నాయా అడగండి..' అన్న మాటకు ఎగిరి గంతేసినంత పని అయింది మనస్సులో.

చల్లని వెన్నెల కురిపించే చంద్రుడు అంటే, అందరికీ ఇష్టమే కదా!

'ఆ చంద్రుడు ఎలా ఏర్పడ్డాడు సార్?'

'విశ్వంలో సూర్యుడు, గ్రహాలు ఏర్పడిన తర్వాత, కొన్ని గ్రహశకలాలు (ఆస్టరాయిడ్లు) గ్రహాల ఆకర్షణకు లోనై, వాటి చుట్టూ తిరిగేవని, అవి కాలక్రమేణా ఉపగ్రహాలుగా మారాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ, భూమి చుట్టూ తిరిగే చంద్రుడి గురించి, ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న, సిద్ధాంతం ప్రకారం సుమారు 4.5 బిలియన్ సంవత్సరాల క్రితం భూమి ఏర్పడిన తొలి రోజుల్లో, మరో గ్రహం వచ్చి భూమిని ఢీకొంది. అందువల్ల భూమిలోని కొంత భాగం, ఆ ఢీకొన్న గ్రహంలో కొంత భాగం కలసి అంతరిక్షంలోకి విసిరివేయబడింది. ఈ భాగాలు భూమి ఆకర్షణకు లోనై భూమి చుట్టూ తిరగసాగింది. తర్వాత కాలంలో ఇది గోళాకారంగా మారింది. అదే ఈనాటి చంద్రుడు.'

'మరి చంద్రుడు భూమికి దూరంగా జరిగి పోతున్నాడట కదా.. సార్! ఎందుకలా జరుగుతుంది?'

'నువ్వు విన్నది నిజమే..! చంద్రుడు ఏర్పడిన కొత్తలో, భూమికి కేవలం 30 వేల కిలోమీటర్ల దూరంలోని తిరిగే చంద్రుడు, భూమిపై తీవ్రమైన ఆటుపోట్లను సృష్టించేవాడు. అందువల్ల భూమి పరిభ్రమణ వేగం తగ్గటమే కాకుండా, చంద్రుడు భూమి నుంచి మరింత దూరంగా జరిగిపోయాడు. ఇప్పుడు చంద్రుడు ప్రతీ సంవత్సరం 3.7 సెంటీమీటర్ల వంతున దూరం జరుగుతూ ఉన్నాడు. ప్రస్తుతం భూమి నుంచి చంద్రుడు సరాసరి 3,84,400 కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు.'

'చంద్రుడు చుక్కల కన్నా పెద్దవాడా సార్?'

'కాదు రాము..! చంద్రుడు నక్షత్రాల కంటే చాలా చిన్నవాడు. చంద్రుడు భూమి కంటే కూడా పరిమాణంలో, బరువులో ఎంతో చిన్నది. నక్షత్రాలకంటే పెద్దగా కనపడడానికి కారణం భూమికి అతి దగ్గరగా ఉండటమే. మనకు అతి దగ్గరగా ఉన్న నక్షత్రం కొన్ని వేల కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉంటే మూడు లక్షల కిలోమీటర్ల దూరంలోనే చంద్రుడు ఉన్నాడు. అందుకే పెద్దగా కనపడతాడు.'

'పున్నమి నాటి చంద్రుడు ఎంత అందంగా ప్రకాశిస్తాడో కదా సార్.!' స్టేట్ మెంట్ ఇచ్చింది ప్రజ్ఞ.

'వాస్తవానికి

చంద్రుడు సూర్యుడి వలె స్వయంగా ప్రకాశితుడు కాదు రా...! స్వయం ప్రకాశక శక్తి సూర్యునికి నక్షత్రాలకు మాత్రమే ఉంటుంది. చంద్రుడికి, భూమికి ఉండదు. సూర్యకాంతి అద్దం మీద పడి ప్రతిబింబించినట్లు, కాంతి చంద్రుడి మీద పడి పరావర్తనం చెందడం వల్ల చంద్రుడు ప్రకాశిస్తున్నట్లుగా కనిపిస్తాడు. మీకు తెలుసా చంద్రుడే కాదు, అంతరిక్షంలోకి వెళ్ళి చూస్తే, భూమి కూడా చంద్రునివలె ప్రకాశిస్తూ కనిపిస్తుంది. ఇలాంటి అనేక విషయాలు మనకు తెలియచేసే బుక్స్ మన లైబ్రరీలో కూడా ఉన్నాయి వాటిని మీరు కూడా చదవండి..'

'సూర్యకాంతి వేడిగా, చంద్రుని వెన్నెల చల్లగా ఉంటుంది కదా!, చందమామ చాలా చల్లగా ఉంటుంది కదా సార్?' అడిగింది ప్రజ్ఞ అనుమానంగా...!

'అలా ఏమి లేదురా... కానీ, చంద్రగోళం మీద సూర్యుని ప్రతాపం చాలా తీవ్రంగా ఉంటుంది. చంద్రుడి గరిష్ఠ ఉష్ణోగ్రత 127 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత -173 డిగ్రీల సెల్సియస్. కాబట్టి, మీరే చెప్పండి చంద్రుడు ఎలా ఉంటాడు...? తనకు తాను మండిపోతూ మనకి చల్లటి వెన్నెల ఇస్తున్నాడు కదా !! ..'

'మరి చంద్రునిపై మచ్చలను చూపిస్తూ అవి కుందేలని, అక్కడ నూలు వడికే ముసలమ్మ ఉందని అమ్మమ్మా నాయనమ్మా చెబుతుంటారు. అది నిజం కాదని నాకు తెలుసు! మరి ఆ మచ్చలు ఎందుకు ఉంటాయి సార్?' అడిగింది ప్రజ్ఞ.

'వాతావరణమే లేని చంద్రగోళంలో జీవులుండవు కదా.. ! దీని ఉపరితలంపై ఎవరెస్టు శిఖరం కన్నా ఎత్తైన పర్వతాలు ఉన్నాయి. చంద్రుడి మీద ఉన్న పర్వతాలలో కొన్ని 'లేబ్నిట్జ్' పర్వతాలు, వీటి ఎత్తు 35 వేల అడుగులు. భూమి మీద ఉన్న ఎవరెస్టు శిఖరం ఎత్తు 29 వేల అడుగులు మాత్రమే. దీనిపై లోయలు విశాలమైన మైదానాలు కూడా ఉన్నాయి.'

'మరి మచ్చల సంగతి' ఆత్రుత ఆపుకోలేక... ప్రజ్ఞ. 'అదే చెపుతున్నాను విను.. చంద్రగోళం మీద, సూర్యకాంతితో పర్వత శిఖరాలు ఎక్కువగా ప్రకాశిస్తాయి. మైదాన ప్రాంతాలు తక్కువగా ప్రకాశిస్తాయి. ఇలా తక్కువగా ప్రకాశించే ప్రాంతాలు చంద్రుడి మీద మచ్చలుగా కనిపిస్తాయి. తెలిసిందా?'

'చందమామ మన భూమి నుంచి ఏర్పడిందని చెప్పారు కదా, మరి భూమి లక్షణాలే దానికుంటాయా?'

'మంచి విషయాన్ని అడిగావురా..! అయితే, '3 కోట్ల నుంచి 4 కోట్ల ఏళ్ల క్రితం భూమిపై ఉన్న వాతావరణమే అక్కడా ఉండేదని నాసా తాజా పరిశోధనల్లో తెలిసింది. నీకు తెలుసా..! సౌర మండలంలో మొత్తం 240 చందమామలున్నాయి. ఇందులో 166 చంద్రులు, 8 గ్రహాల చుట్టూ, 4 చంద్రులు మరుగుజ్జు గ్రహాల చుట్టు తిరుగుతున్నాయి.

భూమికి ఉన్న ఏకైక ఉపగ్రహం చందమామ. ఎక్కువ చందమామలు ఉన్న గ్రహం జ్యూపిటర్. దీని చుట్టూ 66 చందమామలు తిరుగుతుంటాయి. 'గనిమెడ్' వీటిల్లో అతి పెద్దది. అయితే శనిగ్రహం చుట్టూ ఉండే వలయాల్లో కూడా 62 చిన్న చిన్న చందమామలు ఉన్నట్లు ఓ పరిశోధనలో తేలింది. అంగారక గ్రహానికి రెండు చందమామలున్నాయి. కానీ, వీటికి ఒక నిర్దిష్ట ఆకారం ఉండదు. వీటిని ఫోబోస్, డెయిమోస్ అని పిలుస్తారు. నెప్ట్యూన్ చుట్టూ 13 చందమామలు తిరుగుతున్నాయి.' చెప్పిన విషయాల్ని విని, ఆశ్చర్యపోవటం పిల్లల వంతైంది.

'చంద్రమండలం మీద ఎలా ఉంటుంది సార్?' ప్రజ్ఞ ఆసక్తిగా...

'అందంగా కనిపించే ఇది ఒక, రాతి గోళంగా మనం చెప్పుకోవచ్చు. దీనికున్న ఆకర్షణ శక్తి భూమ్యాకర్షణ శక్తిలో ఆరవ వంతు మాత్రమే ఉంటుంది. అందుకే, భూమిపై 60 కిలోల బరువు ఉన్న మనిషి చంద్రమండలంపై 10 కిలోల బరువు మాత్రమే ఉంటాడు. చంద్రమండలం అంతా చాలా నిశ్శబ్దంగా ఉంటుంది. చెట్లు చేమ ఏమీ ఉండవు. అంతా ఎడారి నెల, ఎగుడుదిగుడుగా రాళ్ల రప్పలతో ఉంటుంది. వాటి చుట్టూ ఎత్తైన పర్వతాలు ఉంటాయి. చంద్రుడి మీద ఆకాశం భూమి మీద ఆకాశంలా నీలంగా ఉండదు. నల్లగా ఉంటుంది రాత్రిళ్లు నక్షత్రాలు కనిపిస్తాయి.'

'అంతరిక్షంలోకి వెళ్ళినప్పుడు మనిషిలో ఏమైనా మార్పులు వస్తాయా సార్?' అనుమానం వ్యక్తం చేసింది ప్రజ్ఞ.

'అంతరిక్షంలోకి మనిషి వెళ్ళగానే శరీరంలో కొన్ని మార్పులు ఆరంభమవుతాయి. దీనినే Space adoption syndrome అంటారు. భూ వాతావరణంలో కళ్ళు పంపే సంకేతాలు సులభంగా గ్రహించి దానికి తగ్గట్టుగా మెదడుకు చేరవేయడం జరుగుతుంది ఇవన్నీ చెవిలో ఉన్న ఓటోలిత్ అనే కణాల ద్వారా జరుగుతాయి. భార రహిత పరిస్థితుల్లో ఓటోలిత్ కణాలు ఇటువంటి సంకేతాలు పంపలేవు. రక్తప్రసరణ విషయంలో కూడా మార్పులు జరుగుతాయి. అంతరిక్షంలోకి వెళ్ళగానే ఒకటి లేక రెండు లీటర్ల రక్తం శరీరంలోని కింది భాగాల నుంచి తల, మెడ, థోరాక్స్ భాగాలకు చేరుతుంది. దానివల్ల, పెదవులు, ముఖం వాచినట్టుగా అవుతుంది. రక్త పంపిణీ వల్ల హార్మోనల్ మెటబాలిజంలో మార్పులే కాకుండా.. అడ్రినల్, పిట్యూటరీ గ్రంథులు పని చేయటంలో కూడా మార్పు వస్తుంది. ప్లాస్మా పరిమాణంలో వ్యత్యాసం కనబడుతోంది. ఎర్ర రక్త కణాల సంఖ్య కూడా క్షీణిస్తుంది. మూత్రవిసర్జన ఎక్కువవుతుంది. భారం తగ్గిన శరీరం కొద్దిరోజులకు మామూలుగా అవుతుంది. మనిషి ఎత్తులో కూడా కొంచెం మార్పు వస్తుంది. ఎముకల్లోని లవణాలు తగ్గిపోతాయి. క్యాల్షియం మూత్రం గుండా వెళ్లి పోతుంది.. 0.5 శాతం తగ్గుతుంది. ఇలాంటి మార్పులు తెలుసుకోవటం వల్ల, వాటి నుంచి బయటపడే మార్గాలను అన్వేషించవచ్చు. అలాగే జంతువులను, చెట్లను కూడా ఈ వాతావరణంలో పెంచి, ఈ పరిస్థితుల్లో మొక్కలు ఎలా పెరుగుతాయి? వేర్లు ఏ దిశలో విస్తరిస్తాయి, మొదలైన వాటిని అర్థం చేసుకోవచ్చు. అంతరిక్షంలో వికిరణాల వల్ల శరీరానికి నష్టం కలుగుతుంది. అందుకే అంతరిక్ష పరిశోధన ప్రయోగాలకు రక్షణ ఎంతో అవసరం.'

'చంద్రయాన్-2 గురించిన విషయాలు చెప్పండి సార్?'

'దీని వివరాలు మనం డిజిటల్ క్లాసు రూమ్‌లో నెట్ ద్వారా చూద్దాం..' అని చెప్పటంతో అంతా అక్కడికి చేరుకున్నారు. ప్రాజెక్ట్ చేయబడిన వీడియో ప్రారంభమైంది...

చంద్ర మండలాన్ని శోధించటానికి భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ISRO), రష్యన్ అంతరిక్ష సంస్థ (RKA)ల యొక్క సంయుక్త కార్యక్రమం. ఈ ప్రయోగాన్ని జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (GSLV) వాహనం ద్వారా ప్రయోగిస్తారు, ఇందులో భారత్ తయారుచేసిన లూనార్ ఆర్బిటర్, రోవర్‌లను, రష్యా తయారుచేసిన లాండర్‌నూ ప్రయోగిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ రకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించవచ్చు, కొత్త ప్రయోగాలూ చేయవచ్చు, అని ISRO భావిస్తోంది. చక్రాలు కలిగిన రోవర్ యంత్రం చంద్రుని ఉపరితలం అంతా తిరిగి అక్కడి మట్టి, రాళ్ల నమూనాలను సేకరించి అక్కడే రసాయన విశ్లేషణ చేస్తుంది. ఈ సమాచారం పరిభ్రమిస్తున్న చంద్రయాన్-2 ద్వారా భూమికి చేరవేయబడుతుంది. చంద్రయాన్-1ను, సాకారం చేసిన మైలస్వామి అన్నాదురై నేతృత్వంలోని బృందం చంద్రయాన్-2 పైన పనిచేస్తుంది. శ్రీహరికోట ద్వీపంలో సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి 2650 కేజీలు బరువు ఉన్న జియో సింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ఏంకె-II (GSLV)ని ప్రయోగించాలని ప్రణాళిక తయారుచేశారు. వివరాలు తృప్తి కలిగించాయి పిల్లలకు. దాని తర్వాత మరికొన్ని చంద్రమండల ప్రయాణం గురించిన వీడియోలను చూశారు పిల్లలు.

'మేం కూడా బాగా చదివి చందమామపైకి వెళతాం సార్!' అన్న మూకుమ్మడి మాటకు ఆనందపడిపోయారు క్రాంతి మాష్టారు.

- ఎస్. శ్రీనివాసరావు
9494532570

వివరం

కళా, సాహిత్యం.. కొలువైన గ్రామం...

> ఆరు దశాబ్దాలుగా కళాసంస్కృతిని అక్కడి ప్రజలు తమ జీవితంలో ఒక భాగంగా చేసుకున్నారు. కళా సంస్కృతి వెలుగులు వెదజల్లే గ్రామమది. అక్కడి ప్రజలకు నృత్యం, శాస్త్రీయ సంగీతమంటే ఓ ఆరాధనా భావం. పాశ్చాత్య రచయితలు బెర్నార్డ్‌షా, షేక్స్‌పియర్, లియో టాల్‌స్టాయ్‌ల నుంచి మన కాళిదాసు, గిరీష్ కర్నాడ్, మోహన్ రాకేశ్‌ల గురించి తెలియని స్థానిక రైతు, దుకాణదారుడు, కార్మికుడు, డ్రైవరు అక్కడ లేరు. కళంటే ప్రదర్శన కాదని, సంస్కృతంటే ఆచారాలు కావని, కళాసంస్కృతంటే జీవన వైవిధ్యమని, అభివృద్ధని తెలుపుతోన్న ఆ గ్రామం గురించి ప్రతి ఒక్కరం తప్పక తెలుసుకోవాలి.

బెంగుళూరు నుంచి 350 కిలోమీటర్ల దూరంలో ఉన్న (Shimoga) షిమోగా జిల్లాలో మారు మూలగ్రామం (Heggodu) హెగ్గోడు. ఆశ్చర్యగొలిపే విషయమేంటంటే... ఈ ప్రత్యేకమైన గ్రామాన్ని సాంస్కృతిక జీవన నివాసంగా పిలుస్తారు. కళల రంగంలో జాతీయ అంతర్జాతీయంగా అనేక అవార్డులు విస్తృత గుర్తింపు అందిపుచ్చుకున్న గ్రామమిది.

ప్రారంభం నుంచీ..

1949లో ఓ గుడిసెలో ఔత్సాహిక బృందం థియేటర్‌ను ఆ గ్రామంలో ప్రారంభించింది. అక్కడి ప్రజలు చేస్తున్న పనిలో క్రియాశీలతను పెంచేందుకు సామాజిక-సాంస్కృతిక వారధులైన సినిమాలు, ప్రచురణ రంగాల్లో విశేష కృషి చేసింది. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ, పట్టణ కర్నాటక మధ్య ఓ వారధిని నిర్మించాలనే లక్ష్యం. ప్రారంభరోజుల్లో సాహిత్య వర్క్‌షాపులను నిర్వహించింది. అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకుని, పనిని స్వతంత్రంగా చేసే థియేటర్ బృందం అప్పటి సమకాలీన సమస్యలపై, సినిమాలు, నాటికలు, కళారంగంపై రకరకాల బుక్‌లెట్స్‌ని ప్రచురించింది. ఆ తర్వాత సమీప ప్రాంతాల నుంచి విషయాలను తెలుసుకోడానికి ఔత్సాహికులు సమస్యలపై, సంఘటనలపై చర్చించేటందుకు రావడం ప్రారంభించారు. సంవత్సరాలు గడిచేకొద్దీ, పనిలో ఎక్కువ మంది పాల్గొనడం ప్రారంభించారు. ఆ గుడిసె భవనంగా మార్పు చెందింది. ఆ థియేటర్‌కి (Ninasam's) 'నినాసం' అని పేరు పెట్టారు. కన్నడను మాత్రమే అర్థం చేసుకున్న స్థానికులకు, పరభాష అడ్డం కాకూడదని, ఇతర భాషా చిత్రాలకు కన్నడలో స్క్రీన్‌ప్లేలు రాసి వారికి అందజేసేవారు. అలా తాము చూడాలనుకున్న చిత్రాల గురించి అడిగినప్పుడల్లా 'అపుర్వ్ సంసార్', (బెంగాలీ) 'రషోమన్', 'సెవెన్ సమురాయ్' (జపాన్) గురించి లోతుగా మాట్లాడినప్పుడు ఇదే తరహా ప్రయత్నాన్ని అందించేవారు.

జీవితంలో ఓ భాగం..

రైతులు పొలాల్లో పనిచేసేటప్పుడు, దుకాణదారుల మధ్య, ప్రయాణాల్లో డ్రైవర్లు, పనిచేసే చోట కార్మికులు సాహిత్య చర్చలను చేసి మనుషుల మధ్య సజీవ సంబంధాలను కొనసాగిస్తున్నారు. హెగ్గోడు గ్రామంలో ప్రతి ఒక్కరూ నేటికీ సాహిత్య, నాటక, కళా, చిత్ర రంగాలను తమ జీవనశైలిలో ఓ భాగం చేసుకున్నారు. కళ సంస్కృతిపై లోతైన శ్రద్ధ వహించే ఈ గ్రామ సంస్కృతిని కళ్లారా చూసేటందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచీ ఔత్సాహికులందరూ వచ్చి సందర్శిస్తుంటారు. ఇప్పుడా నినాసం వద్ద రోజూ సాహిత్య చర్చలు, నాటిక, నృత్యం, శాస్త్రీయ సంగీతం వంటి ప్రదర్శనలతో నిండి ఉంటుంది. నినాసం రెసిడెన్షియల్ థియేటర్ శిక్షణ, ఇన్స్‌టిట్యూట్, ఫౌండేషన్, అక్షర ప్రకాశం పబ్లిషింగ్ హౌస్ వంటి బహుముఖ సంస్థలుగా అభివృద్ధి చెందింది.

మేధో సంభాషణ...

ప్రతి సంవత్సరం ఏడు రోజుల పాటు వార్షిక కార్యక్రమం, మేధో సంభాషణ, సామాజిక, రాజకీయ అంశాల్లో లోతైన చర్చలు చేస్తారు. సంబంధ బాంధవ్యాలు, భద్రతా, కట్టుబాట్లు, మూఢనమ్మకాలు, విద్యా, ఆరోగ్యం వంటి విషయాలపై అవగాహన పెంచేందుకు నాటికలు ప్రదర్శిస్తారు. ఆ క్యాంపస్‌లో ప్రతి భాగం సహజ పరిసరాలతో, హస్త కళా చిత్రాలతో, పచ్చని చెట్లతో నిండి ఉంటుంది. రిహార్సల్ హాళ్లు, లైబ్రరీ, ఇన్‌స్టిట్యూట్, క్యాంటీన్, సంగీత, నృత్యం ప్రధానంగా ఉంటాయి.

నినాసం చేసిన గొప్ప కషికి థియేటర్ సంబంధిత కళల రంగంలో జాతీయ అంతర్జాతీయంగా విస్తృత గుర్తింపు అనేక అవార్డులు వచ్చాయి. ఇప్పటికీ దిగ్విజయంగా కొనసాగుతోన్న నినాసం కర్ణాటకలోని ప్రతి మూలలో సాంస్కృతిక అక్షరాస్యతను పెంపొందించడంలో పెద్ద పాత్ర పోషించడమే కాదు, థియేటర్ వివిధ ప్రయోజనాలను వివరించడం ద్వారా దేశంలోని అనేకమందికి ఈ గ్రామం, ఆ ప్రజలు ఎంతో స్ఫూర్తిదాయకం.

నవ్వుల్... పువ్వుల్

చాక్లెట్ ఇస్తే...

టీచర్ : ఒరేయ్ బంటి! నువ్వు పొరపాటున ఒక వ్యక్తి కాలు తొక్కితే ఏం చేస్తావ్?

బంటి : ఏం చేస్తాను. సారీ చెప్తాను టీచర్!

టీచర్ : వెరీగుడ్..! తప్పు తెలుసుకున్నావని ఆ వ్యక్తి నీకు చాక్లెట్ ఇస్తే ఏం చేస్తావ్?

బంటి : రెండో కాలు కూడా తొక్కి సారీ చెప్తాను టీచర్.

కరెక్ట్ నెంబర్

వెంగళప్ప : నేనెన్ని సార్లు ఫోన్ చేసినా రాంగ్ నెంబర్ అని చెప్తుంది?

చంటి : అయితే కరెక్ట్ నెంబర్‌కి ఫోన్ చెయ్యి.

వెంగళప్ప : కరెక్ట్ నెంబర్ అడుగుతుంటే చెప్పటం లేదు...!



సమాచార హక్కు చట్టం

లీగల్ కాలమ్



ప్రాథమికంగా చట్టాలన్నీ ప్రజా ప్రయోజనాల కొరకే చేయబడతాయి. వాటిని సద్వినియోగ పరచాలనేది చట్ట నిర్మాతల ఆకాంక్ష. అయితే, అందరి ఆలోచనలూ ఒక్క తీరుగా ఉండవు. పారదర్శక పాలనకి ఉద్దేశించినదే సమాచారహక్కు చట్టం. అవసర, అత్యవసర, ప్రజాప్రయోజన, రహస్య సమాచారాలను ఈ చట్టం కల్పించిన హక్కు ద్వారా సాధికారంగా పొందవచ్చు. అయితే, కొందరు ఈ హక్కును దుర్వినియోగపరుస్తూ, వ్యక్తిగత సమాచారాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలను కోర్టులు అడ్డుకుంటున్నాయి.. మందలిస్తున్నాయి కూడా. ఇలాంటి ఒక కేసు తెలుసుకుందాం.

హర్యానా మాజీ పోలీసు డైరెక్టరు జనరల్ పి.సి. వాధవా సోనియాగాంధీ, ఆమె కుమార్తె, ఆమె కుమారుడు జనగణన పత్రంలో 'మతం, మతవిశ్వాసం' గురించి ఏమి రాశారో వెల్లడించాల్సిందిగా న్యూఢిల్లీలోని రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ ఆపరేషన్స్ ముందు.. కొందరు ప్రజా నాయకుల మత విశ్వాసాల వివరాలు కోరుతూ ఒక పిటీషను దాఖలు చేశారు. అది తిరస్కరించాక, ఆయన సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమీషన్‌కి పిటీషను పెట్టుకున్నారు. అక్కడ కూడా పిటీషను తిరస్కరించబడడంతో హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా ఆయనకు చుక్కెదురైంది. పిటీషనరు కింద తెలిపిన విధంగా వాదించారు.

'సమాచారహక్కు చట్టం సెక్షను 22 కింద సెక్షను 8(ఐ) (జె)కున్న మినహాయింపు రద్దవుతుంది. అది వ్యక్తిగత సమాచారంగా భావింపబడదు. ప్రజాప్రయోజనాల కోసం ఈ సమాచారాన్ని నిరాకరించరాదు.' హైకోర్టు ఈ వాదన తిరస్కరించింది.

పిటీషనర్ వ్యక్తిగత సమాచారం కోసం చేస్తున్న ప్రయత్నం ఇందులో స్పష్టంగా తెలుస్తోంది. సెన్సెస్ చట్టం సెక్షను 15 కింద వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వటం నిషేధించబడింది. కాబట్టి, పిటీషన్ తిరస్కరిస్తున్నాము' అని పేర్కొన్నారు. మాజీ డి.జి.పి వాధవా పట్టు వదలని విక్రమార్కుడిలా, హైకోర్టు తీర్పుకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో 'స్పెషల్ లీవ్ పిటీషన్' దాఖలు చేశారు. ఆయన తరపున సీనియర్ లాయర్ ఎమ్.ఎన్.కృష్ణమణి హాజరయ్యారు. జస్టిస్ ఆర్.వి.రవీంద్రన్, జస్టిస్ ఎ.ఆర్. పట్నాయక్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్ విచారించింది. లాయర్ కృష్ణమణి తమ వాదనలో, పిటీషనర్ కోరిన సమాచారాన్ని, చట్టంలోని సెక్షను 11 కింద, వ్యక్తిగత సమాచారాన్ని ఇచ్చేముందు, సంబంధిత వ్యక్తికి తెలియజేసి, వారి ఆమోదంతో ఇవ్వొచ్చునన్నారు. అలాంటి ప్రయత్నమేమీ చేయకుండానే, ఏకపక్షంగా తిరస్కరించటం సరికాదన్నారు. కాబట్టి, పిటీషనరు కోరిన సమాచారాన్ని ఇవ్వవలసిందిగా సెన్సెస్ ఆఫీసరుకి సూచించాల్సిందిగా కోరారు. దీనిమీద న్యాయమూర్తులు స్పందిస్తూ 'చట్టంలోని సెక్షను 8(ఐ)(జె) కింద వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదు. అధికారి సమాచారం ఇవ్వదలిస్తేనే, సంబంధిత వ్యక్తికి తెలపాల్సి ఉంది. ఈ కేసులో ఆ అవకాశం లేదు. కాబట్టి, పిటీషన్ డిస్మిస్ చేస్తున్నాం' అన్నారు.

ఇలాంటి మరొక కేసు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆదాయ వివరాలకు సంబంధించినది సమాచార హక్కుచట్టం కింద డాక్టరు బాలచంద్రన్ అనే వ్యక్తి ఇన్‌కంటాక్స్ అధికారులకు పెట్టిన పిటీషన్ తిరస్కరించబడింది. పిటీషనర్ కేవలం వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించడానికే ఈ సమాచారం కోరారనే కారణంగా తిరస్కరించబడింది.

- కాటూరు రవీంద్ర త్రివిక్రమ్,
న్యాయ నిపుణులు

పదవికాసం 166

కూర్పు : రావెళ్ళ

1		2		✿	3	4		5
	✿		✿	6	✿		✿	
7		✿	8			✿	9	
	✿	10	✿		✿	11	✿	
✿	12			✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

ఆధారాలు

అడ్డం

1. ఇలకోడి (4)
3. రెండు మూటలు (4)
7. మొలక (2)
8. అస్థి, ఎముక (3)
9. గారె (2)
12. చేతితో నేయడం (3)
13. వెదుకు, శోధించు (3)
17. పల్లె (2)
18. రూపం (3)
19. కొండ (2)
22. ఏ పనయినా చేసి ఏమీ తెలియనిదానిలా ఉండే వ్యక్తి (4)
23. నీటిలో పడి చనిపోయే ప్రమాదం (4)

నిలువు

1. వివాదం, కలహం (4)
2. రాజుగారి భార్య(2)
4. తోము (2)
5. ప్రవర్తన తిరగబడింది (4)
6. తుదిలేని కార్మికుడు (3)
10. నేర్పుగలవాడు గజిబిజిగా (3)
11. చలించిపోవడం (3)
14. ఉన్నత స్థానం (4)
15. తెలుగు సంవత్సరాల్లో ఇరవై నాలుగో సంవత్సరం పేరు (3)
16. వికాసం (4)
20. తిరగబడ్డ ధ్వని (2)
21. అల్లరి (2)

30-6-19 జవాబు

1 అ	ర	2 సో	ల	✿	3 షా	4 ద	చా	5 రి
ప	✿	దా	✿	6 శ	✿	ఫా	✿	చా
7 హా	స్యం	✿	8 గ	రీ	బు	✿	9 బ్ర	హ్మ
స్యం	✿	10 వి	✿	రం	✿	11 చం	✿	బ్ర
✿	12 గు	ర	క	✿	13 ము	ద్రి	తం	✿
14 యు	✿	క్తి	✿	15 వి	✿	క	✿	16 ప
17 చే	ష్ట	✿	18 స	మా	నం	✿	19 తు	ద
ద్దు	✿	20 మో	✿	నం	✿	21 నా	✿	హా
22 ము	21 దు	పు	లు	✿	23 ట్టి	వ	వే	రు

సుడోకు

1		5	9		6			
2	4		7					
				1	2	3		5
3	2				7			
7				5		6		
	8		4	6		7		3
	5		3		4		6	7
9	6					8		

1	7	2	5	8	3	6	9	4
3	8	4	2	9	6	5	7	1
9	6	5	1	4	7	8	2	3
4	5	3	8	6	2	7	1	9
6	9	8	7	3	1	2	4	5
2	1	7	9	5	4	3	6	8
5	2	1	4	7	8	9	3	6
7	3	9	6	1	5	4	8	2
8	4	6	3	2	9	1	5	7

లెక్కించండి



1 పజిల్

2 పజిల్



గతవారం జవాబులు

1 పజిల్‌కు సమాధానం
ఆపిల్ 7, ద్రాక్ష 12, అరటిపండు 2 చివరి వరుసలో సమాధానం (21)
2 పజిల్‌కు సమాధానం (6,7,12)

ఈ పజిల్స్‌కి జవాబులు వచ్చేవారంలో ....

వెజిటబుల్ సూప్

కావాల్సినవి :

క్యారెట్, కాలిఫ్లవర్, క్యాబేజీల తురుము - 2 టేబుల్ స్పూన్లు చొప్పున, వెల్లుల్లి పేస్టు- 2 టీ స్పూన్లు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర తరుగు- 3 టేబుల్ స్పూన్లు, ఉల్లికాడల తరుగు- 4 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి తగినంత, మిరియాలపొడి- పావు టీ స్పూను, నిమ్మరసం- 1 టేబుల్ స్పూను, మొక్కజొన్న పిండి- 2 టేబుల్ స్పూన్లు, నీరు- 4 కప్పులు, సోయా సాస్- 1 టేబుల్ స్పూను.

తయారీ :

నూనెలో వెల్లుల్లి పేస్టు సన్నని మంటపై అర నిమిషం వేగించాలి. తర్వాత క్యారెట్, కాలీఫ్లవర్, క్యాబేజీ తరుగుని వేసి 40 సెకన్లు వేగించాలి. సగం ఉల్లికాడల తరుగును కూడా వేసి 15 సెకన్లు వేగించి మూడున్నర కప్పుల నీరు, ఉప్పు కలపాలి. అర కప్పు నీటిలో మొక్కజొన్న పిండి కలిపి ఉంచుకొని, కూరగాయల మిశ్రమం మరగడం మొదలవగానే వేసి కలపాలి. 2 నిమిషాల తర్వాత మంట తీసేయాలి. ఇప్పుడు కొత్తిమీర తరుగు, వెనిగర్ కలిపి బౌల్స్‌లో వేసుకుని పైన మిరియాలపొడి, (మిగిలిన) ఉల్లికాడల తరుగు, సోయాసాస్ చల్లి వేడి వేడిగా తాగాలి.

ఆనియన్ సూప్

కావలసినవి :

పావుకిలో తరిగిన ఉల్లిపాయలు, ఒక టేబుల్ స్పూన్ మైదాపిండి, కూరగాయ ముక్కలు ఉడికించిన నీళ్లు ఒక లీటర్, ఒక టేబుల్‌స్పూన్ చక్కెర, ఒక కప్పు వెన్న, తరిగిన వెల్లుల్లి రెబ్బలు రెండు, బిరియానీ ఆకులు రెండు, తగినంత ఉప్పు తగినంత, మిరియాల పొడి.

తయారీ :

ఒక గిన్నెలో వెన్న వేసి వేడిచేయాలి. దానిలో ఉల్లిపాయలు, బిరియానీ ఆకులు వేసి ఐదు నిమిషాల పాటు వేగించాలి. తరువాత పుదీనా, మైదాపిండి వేసి బాగా కలపాలి. మూడు నిమిషాలయ్యాక కూరగాయలు ఉడికించిన నీళ్లు పోసి సన్నని మంటపై ముప్పావుగంటసేపు ఉండికించాలి. ఆ తరువాత తగినంత ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. దీన్ని టోస్ట్ బ్రెడ్‌తో తీసుకుంటే చాలా రుచిగా ఉంటుంది.

రుచి

రాజ్మా సూప్

కావాల్సినవి :

రాజ్మా గింజలు - ఒక కప్పు, సన్నగా తరిగిన ఉల్లిముక్కలు - పావు కప్పు, పచ్చిమిర్చి తరుగు - ఒక టేబుల్ స్పూను, వెల్లుల్లి పేస్టు - ఒక టీ స్పూను, టమాటా పేస్ట్ - పావు కప్పు, నూనె - 2 టీ స్పూన్లు, ఉప్పు - తగినంత.

తయారీ :

రాజ్మా గింజలను 6 గంటల పాటు నాన బెట్టండి. తర్వాత తగినన్ని నీళ్లు జతచేసి ప్రెషర్ కుక్కర్లో మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. ఉడికిన రాజ్మాను మిక్సీలో వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చెయ్యండి. ఒక గిన్నెలో నూనె వేడిచేసి ఉల్లిముక్కలు, పచ్చిమిర్చి తరుగు, వెల్లుల్లి పేస్టు వేసి వేగించండి. రెండు నిమిషాల తర్వాత టమాటా పేస్ట్ కలపండి. టమాటా పచ్చివాసన పోయాక రాజ్మాపేస్ట్, ఉప్పు కలిపి మరో ఐదు నిమిషాలు ఉడికించండి. సూప్ వడ్డించినప్పుడు పైన కొద్దిగా తరిగిన చీజ్ లేదా క్రీమ్ వేసి సర్వ్ చేయవచ్చు.

రోదసీ గీతం

'ది లక్కీ మూన్: మ్యూజిక్ ఫర్ డ్రీమ్స్'.... క్లౌడ్‌స్పేస్, యాంబియెంట్ మ్యూజిక్‌తో దిగంతాల ప్రయాణం చేస్తున్న అనుభూతి కలుగుతుంది. రోదసీయానం మీద తీసిన హాలీవుడ్ చిత్రాల్లో నేపథ్య సంగీతంగా మధ్యమధ్యలో ధ్వనించే ఈ సంగీతాన్ని గంటకు పైగా దీనిలో వినొచ్చు. ఆర్టిస్ట్ బిల్ శాటిలైట్స్ దీన్ని స్వరపర్చారు. మనసు నెమ్మదించడానికి, నిద్ర కళ్లు పడటానికి ఈ సంగీతం ఉపయోగపడుతుంది. రోజువారీ గందరగోళాన్నంతా వదిలించుకునేందుకు హాయిగా దీన్ని వినొచ్చు. ఇక ఒక్కసారిగా మనసు పరవశించడానికి డేవిడ్ విట్టా ఫియట్ లవ్‌లాక్‌ల 'లల్లబీ ఆఫ్ ది మూన్' వినొచ్చు. ఎమోషనల్ ఫిమేల్ వోకల్స్‌తో ఇది హృదయాన్ని ద్రవింపజేస్తుంది. క్రెసెంట్ బ్లేడ్ వంటి నెలవంక వర్ణనలు నిండిన ఈ ఇంగ్లీష్ లిరిక్సూ ఆకట్టుకుంటాయి.

సంగీతికా

'లా లూనా' ఇటాలియన్ యానిమేషన్ షార్ట్. డిస్నీ పిక్సార్ నుంచి వచ్చిన ఈ చిత్రం పూర్ణచంద్రుడు నెలవంకలా ఎలా మారతాడనే ఊహాప్రపంచపు కథతో తీసింది. ఇటాలియన్ జానపదాలు, పిల్లల కథల ప్రేరణతో రచయిత, దర్శకుడు కాసారోసా ఈ కథ రాసుకున్నాడు. సముద్ర తీర ప్రాంతానికి చెందిన ఓ జినోయిస్ పిల్లాడు తన తండ్రి, తాతలతో అర్ధరాత్రి పడవ ప్రయాణం చేస్తాడు. ఆ చిన్నారి పేరు బాంబినో. సముద్రంలో మధ్యకు చేరుకున్నాక పడవను ఆపి.. తండ్రి, తాతలు క్యాప్ బహుమతినిస్తారు. దాన్నెలా బాంబినో ధరించాలనే దానిపై ఇద్దరికీ పట్టింపు వస్తుంది. ఒకరు కిందకు లాగి తొడిగితే, మరొకరు పైకి అంటారు. ఇది సద్దుమణిగాక... చంద్రుడు ఉదయిస్తాడు. వెన్నెలతో లోకాన్ని నింపేస్తున్న ఆ పూర్ణచంద్రుడిని చూసిన చిన్నారి

బొమ్మల కథ



నెలవంక.. ఓ బాలుడు...

ఆశ్చర్యపోతాడు. ఈలోగా తాత, తండ్రులు నిద్రలేచి ఓ పెద్ద నిచ్చెనను చంద్రుని మీదకు వేస్తారు...? తర్వాత ఏమైందనే ఆత్రుత పెరిగింది కదండీ..! ఇటాలియన్ బుడతల ఊహాలోకంలోకి ఈ చిత్రాన్ని పూర్తిగా చూసి వెళ్లండి. పూర్ణచంద్రుడు నెలవంకలా 'ఎలా మారతాడో' తెలుసుకుని రండి.. సరదాగా..! ఆస్కార్ అవార్డుకీ నామినేట్ అయిన ఈ షార్ట్‌ఫిల్మ్‌ని 'బ్రేవ్' యానిమేషన్ మూవీతో కలసి ప్రదర్శించారు. ఏడు నిమిషాలుండే ఈ చిత్ర నిడివిలో ఓ ఫాంటసీ ప్రయాణం చేసొస్తాం.



సుచిత్రం

వావ్.. మూన్‌వాక్...!

చంద్రుడి మీద మానవుడి తొలి అడుగు ఎలా పడింది..? ఎంత ప్రయత్నముందీ, మరెంత సాహసముందీ..? క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే నాసా డాక్యుమెంటరీలు చూడాల్సిందే. అపోలో మిషన్స్‌ని ఓ టైమ్‌లైన్ రూపంలో యూట్యూబ్‌లోనూ బోలెడు వీడియోలున్నాయి. అస్సలు నిజంగా మూన్‌వాక్ జరిగిందా..? లేదా...? అనే కాన్స్పిరసీ వీడియోలు కోకొల్లలున్నాయి..! వీటిని చూసి తలబొప్పి కట్టించుకోవడం ఎందుకు కానీ, నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఎలా కేరింతలు గెంతులు వేశాడో క్షణక్షణం ఉత్కంఠగా సాగిన మిషన్‌నూ ఆ కాలంలోనే, అక్కడే ఉన్నట్టు ఫీలవుతూ చూసే అవకాశం కల్పిస్తున్న వీడియోలూ ఉన్నాయి. పదేళ్ల క్రితం నేషనల్ జాగ్రఫిక్ 'డైరెక్ట్ ఫ్రమ్ ద మూన్' డాక్యుమెంటరీ తప్పకచూడాల్సినది. చంద్రుడి ఉపరితల భాగాన్ని హెచ్‌డీలో చూపించిన ఈ వీడియో మనల్ని ఆశ్చర్యాలతో ముంచెత్తుతుంది. చంద్రుడి మీది నుంచే నేరుగా ఫుటేజ్ ప్రసారం చేశారు. ఇలాంటి ఎన్నో డాక్యుమెంటరీలు, వీడియోలు నెట్టింట నిండుగానే ఉన్నాయి. చూసి మన చిరకాల మిత్రుడు చంద్రుడి గురించి బోలెడు విషయాలు తెలుసుకోండే..!





మనసెందుకో రెండు లక్షల మైళ్లు దూరానికి క్షణంలో చేరిపోవాలని ఒకటే లాగుతుంది..? ఎందుకంటే.. మన సెలెస్టియల్ దగ్గరి నేస్తం శశి అక్కడ సఖిలా అరనవ్వు నవ్వుతుంది. అంతదూరాన్ని మటుమాయం చేస్తూ తనువెల్లా వెన్నెలతో తడుముతుంది. అప్పుడప్పుడూ నీడల్లో దాక్కుని కొన్ని క్షణాలైనా అంతులేని భయాన్ని, విరహాన్ని మిగులుస్తుంది. మెరిసేటి నింగి తారలెన్నున్నా మన ప్రేమంతా కురిసేది చంద్రమ మీదే. నోర్డిక్ నుంచి తూర్పాసియా ప్రేమ కథల్లో ప్రియతముల చెలిమంతా ఈ ప్రియవదన తోడే. బహుశా.. మూన్ ఒక్కటే అనుకుంటా జెండర్ బయాస్ లేనిది..! మనకు చందమామ అయితే, వోల్వరిన్ గాథలో అందని ప్రేయసి. బహుశా... చాంద్ ఒక్కడే అనుకుంటా అన్ని జెండర్లూ ఒకేలా ప్రేమించేది..! ప్రతి ఒక్కరి సింబాలిజమ్‌లో భావజాలంలో చంద్రునికి చోటుంటుంది. చంద్రుని కళల్లో ఏ పక్షమెంత ఇష్టమో..! ఎవ్వరికిష్టమో..!? చెప్పలేం. రాత్రిని వెలిగించి కాసింత ధైర్యాన్నిస్తుందనేమో మనిషికి మొదటి రోదసి ప్రాణమిత్రుడయ్యాడు రేరేడు. మానవ సంస్కృతి వికాసంలో ప్రతీకగా ఎప్పటికీ వన్నె తగ్గని వెన్నెలగా వెలిగాడు. కళాకారుల, సృజనజీవుల సబ్జెక్ట్ అయ్యాడు. ఆబ్జెక్టిపై చేయలేని అభిమానుల్ని మిగుల్చుకున్నాడు. తదేకంగా అలా చూస్తుండిపోయేలా తనలో లీనం చేసుకునే చాంద్నీపై ఈ కేన్వాస్ ప్రేమ లేఖల్ని చదవండి మరి..! మూన్ ఓ యాస్తెటిక్ సింబల్. జీవితాంతం ప్రేమిస్తామని చెప్పేందుకు 'ఐ లవ్ యూ..! టు ద మూన్ అండ్ బ్యాక్' అని అనడంలోనే అతడి/ఆమె మీద ఎంత లవ్వో తెలీడంలేదు. మూన్‌కి డార్క్‌సైడూ ఉందేమో గానీ, బ్లడ్‌మూన్ అని హారర్‌లుక్ తేవొచ్చేమో గానీ, ఎన్ని చెప్పినా, ఎంత మసకబార్చినా... మబ్బుల్లోంచి బుజ్జాయిలా చల్లని తెల్లని నవ్వుతో బయటపడిపోతాడు కదా..!



శశీ.. సఖీ..!

మరియు వెన్నెల ప్రేమలేఖలు...

కవిత్వమ్



గూటికి చేరే ముందు

ఇన్ని రోజులు గడిచాక
నెమ్మది నెమ్మదిగా చూపుల్ని
నెడుతూ
ఒంటరి ఇల్లును వదిలి
స్వస్థలం చేరుకోడానికి
ఆరుబయట ఊగే గాలిలా
మనసు నిలకడగా లేదు

చుట్టూ చూస్తున్నాను
ఆదరించే ప్రపంచం నెలకొని ఉంది
ఒక చోట ఉండాలనే ఉంటుంది
వీచే గాలులు ఉరిమే ఉరుములు
ఏవీ నాలో నన్ను అట్టే ఉండనీయవు

ఏదో ముందుకు లాగినట్లు
గెలుపేదో ఒక మార్గం
నిర్దేశిస్తున్నట్లు

కాలాల్ని అనుకొని స్థలాలు మారతాం
నా వాకిలి రోడ్డును చూస్తూ
నా పెరటి చెట్టును ఆస్వాదిస్తూ
కాసిన్ని అడుగుల్ని ముందుకు
నడిపాను .

నాలాగే దూరం వచ్చి
సొంతూరు పోవాల్సినవారు కలిశారు
జీవితమూ మనసూ మారలేదు
కాస్త ఆర్థిక ప్రమాణాలు తప్ప.

ఇపుడొకటనిపిస్తుంది
ఉదయం ఎగిరిన పిట్టలు చెట్టునొదిలి
ఉండలేవు
మళ్ళీ గూటికి
అలసి సాయంకాలం వాలింది

- గవిడి శ్రీనివాస్
99665 50601

కొత్త కథలు

ఎరుపెక్కిన కళ్ళకు మాటలొస్తే
ప్రతి కన్నీటి బొట్టు సాక్షరమై
జీవన సత్యాలను నిజం చేస్తాయి
మూగబోయిన గొంతులకు చూపునిస్తే
ప్రతి నిశ్శబ్దం ఓ చిత్తరువై
నడుస్తున్న చరిత్రను ఆవిష్కరిస్తాయి
అలసిపోయిన హృదయాలకు ఊరటనిస్తే
ప్రతి స్పందన ఓ కొత్త రాగమై
భువనఘోషను ఆలపిస్తాయి
శిధిలమైన శరీరాలకు శక్తినిస్తే
ప్రతి కదలిక ప్రభంజనమై
ప్రపంచ గమనాన్నే శాసిస్తాయి
ఓడిపోయిన గుండెలకు ధైర్యాన్నిస్తే
ప్రతి ఊపిరి ఓ ఉత్తేజమై
విజయ తీరాలకు చేరుస్తాయి
భారమైన బతుకులకు భరోసానిస్తే
ప్రతి జీవనం ఓ అక్షరమై
కొత్త కథలకు ప్రాణం పోస్తాయి

- ఈదర శ్రీనివాసరెడ్డి
78931 11985



ఉత్తరం

తొలకరి ముద్దాడిన
మట్టివాసనలా
నీ జ్ఞాపకాల పరిమళాలు
నన్ను ముసురుకున్నాయి
వర్షిస్తున్న మేఘంలా
నీ తలపుల ప్రవాహాలు
నన్ను నిలువెల్లా
ముంచెత్తుతున్నాయి

సుదూర తీరాలకు వారధివై
ఎన్నెన్ని కబుర్లను
మోసుకొచ్చేదానివి
ప్రేమల్ని, సంతోషాల్ని పంచుతూ
ఎంత ఆప్యాయంగా తడిమేదానివి
కష్టాల్ని, సుఖాల్ని
కథల్ని, వ్యధల్ని
పొట్లం కట్టి చేతికందించేదానివి

ఇప్పుడు మూగబోయిన
మౌనశిలగా మిగిలావంటే
హృదయం ద్రవిస్తుంది
కనుమరుగయ్యావంటే
మనసు జ్వలిస్తుంది

అప్పుడప్పుడు వచ్చిపోయే
అందమైన కల మాదిరిగా
నువ్వు స్మృతిపథంలో
మెదిలినప్పుడల్లా
అమ్మమ్మ ట్రంకుపెట్టెలో
ముడతలు పడిన నిన్ను స్పర్శిస్తూ
ప్రేమగా హృదయానికి
హత్తుకుంటాను

నిన్ను తలచుకొన్నప్పుడల్లా
నువ్వు అందించిన మధురక్షణాలు
నువ్వు మోసుకొచ్చిన
తియ్యనిఊసులు
ఎదలోయలో పచ్చపచ్చగా
చిగురిస్తుంటాయి!

- కడెం లక్ష్మి ప్రశాంతి
78933 99773